తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక
# జనంసాక్షి
www.janamsakshi.org
ఖమ్మం - నల్లగొండ
భద్రాద్రి కొత్తగూడెం
సూర్యపేట
యాద్రాద్రి భువనగిరి
ఆదివారం
26 జూలై 2026
పేజీలు : 8



# డ్యూటీలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు

❍ఓపీలో సీనియర్ ప్రొఫెసర్లు ఉండాలి
❍ఉదయం 9 గంటలకే హాజరు నమోదు కావాలి
❍ కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్



**సూర్యాపేట ప్రతినిధి (జనంసాక్షి):** సూర్యాపేట ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో ఇకపై వైద్యులు, సిబ్బంది విధుల్లో క్రమశిక్షణ, రోగులకు మెరుగైన వైద్యం అందించడమే లక్ష్యంగా జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. శనివారం ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిని కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విధులకు ఆలస్యంగా వచ్చినా, డ్యూటీలో నిర్లక్ష్యం వహించినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆసుపత్రి సిబ్బంది పనివేళలపై స్పష్టమైన ఆదేశాలిచ్చారు. ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు విధుల్లో ఉండాలని, 100 శాతం బయోమెట్రిక్ హాజరు ఉండాలని స్పష్టం చేశారు. ఉదయం ఇన్ టైంలో, సాయంత్రం ముందే వెళ్లిపోయినా అడ్మినిస్ట్రేటివ్ చర్యలు ఉంటాయని అన్నారు. ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా డ్రెస్ కోడ్ పాటించాలని, ఐడీ కార్డులు ధరించాలని ఆదేశించారు. ఓపీ విభాగాల్లో ప్రొఫెసర్లు, అసోసియేట్ ప్రొఫెసర్లు, అసిస్టెంట్ ప్రొఫెసర్లు క్లినికల్ అవర్స్ లో విధిగా ఉండాలని సూచించారు. జూనియర్ డాక్టర్లపైనే భారం వేయకుండా సీనియర్లు నేరుగా రోగులను పరీక్షించాలని పేర్కొన్నారు. ప్రస్తుతం వర్షాకాలం కావడంతో డెంగ్యూ, టైఫాయిడ్, మలేరియా వంటి సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని, మెడికల్ వార్డులను నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు. ప్రతిరోజూ ఫీవర్ కేసులు, అడ్మిషన్లు, డిశ్చార్జ్ వివరాలను అప్‌డేట్ చేయాలని చెప్పారు. మందుల కొరత లేకుండా బఫర్ స్టాక్ అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. ఆసుపత్రిలో మౌలిక సదుపాయాలు, అత్యాధునిక శస్త్రచికిత్సల కోసం లాపరోస్కోపిక్ సెట్స్, అడ్వాన్స్ లాపరోస్కోపీ టవర్స్ కొనుగోలుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. వీటిని కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ నిధులు లేదా కలెక్టరేట్ గ్రాంట్ల ద్వారా సమకూర్చుకోనున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్లు జనార్ధన్, అనిత, ఉపేందర్, యశ్వంత్, గీత, సంధ్య, వినయ్ తదితరులు పాల్గొన్నారు.



# రైస్ మిల్లు బూడిద కాలుష్యంతో ప్రజలకు ఇబ్బందులు

**హుజూర్‌నగర్, జూలై 25, (జనంసాక్షి) :** పట్టణంలోని మిర్యాలగూడ రోడ్డులోని శ్రీలక్ష్మి గణేష్ ఫార్ బాయిల్డ్ మోడ్రన్ రైస్ మిల్లు నుండి వెలువడుతున్న బూడిద, పొట్టు కాలుష్యంతో పరిసర కాలనీ వాసులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు అన్నారు. మిల్లు యాజమాన్యం నిబంధనలకు విరుద్ధంగా పొట్టు గది, బూడిద గది లేకుండా కాలుష్యాన్ని బహిరంగంగా వదులుతున్నారని స్థానికులు ఆరోపించారు. గత నెల రోజులుగా విచ్చలవిడిగా బూడిదను బయటకు వదలడం వల్ల వాహనదారుల కళ్లల్లో బూడిద పడి రోడ్డు ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. మిల్లుకు కనీసం ప్రహరీ గోడ కూడా లేదు. గత 15 రోజుల క్రితం బాధితులు మున్సిపల్ కమిషనర్ సతీష్ కు ఫిర్యాదు చేయడంతో ఆయన స్థలాన్ని పరిశీలించి కాలుష్య నివారణ చర్యలు తీసుకోవాలని మిల్లు యజమానిని హెచ్చరించారు. అయినప్పటికీ యాజమాన్యం పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపించారు. శనివారం పరిసర కాలనీ వాసులు మిల్లు వద్దకు చేరుకుని యాజమాన్యాన్ని నిలదీశారు. మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు పోలిశెట్టి నరసింహారావు, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు గెల్లి రవి అక్కడికి చేరుకుని 15 రోజుల్లో అన్ని నివారణ చర్యలు తీసుకోవాలని యాజమాన్యానికి సూచించి బాధితులను శాంతింపజేశారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు యడ్ల విజయ్, శ్రీమన్నారాయణ, నాగేశ్వరరావు, ఆంజనేయులు, లాలయ్య, నరసింహ, శంకర్ రావు, బుజ్జి తదితరులు పాల్గొన్నారు.



## కేంద్ర మంత్రి రాజీనామా ప్రజాస్వామ్య విజయం
## ఎంపీ రఘురాం రెడ్డి



**ఖమ్మం కార్పొరేషన్, జులై 25 ( జనం సాక్షి )** కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయడం ప్రజాస్వామ్యానికి దక్కిన గొప్ప విజయమని ఖమ్మం పార్లమెంట్ సభ్యులు రామసహాయం రఘురాం రెడ్డి స్పష్టం చేశారు. విద్యార్థి శక్తి ముందు నిరంకుశత్వం తప్పకుండా లొంగాల్సిందేనని ఆయన తేల్చిచెప్పారు. లక్షలాది మంది విద్యార్థుల జీవితాలు, భవిష్యత్తుతో ఆడుకున్న కార్పొరేట్–కాషాయ సర్కారుకు ఈ పరిణామం ఒక బలమైన చెంపపెట్టు అని ఆయన విమర్శించారు. ఈ సువర్ణాక్షర విజయం దేశవ్యాప్తంగా ఉన్న పోరాట శ్రేణుల్లో నూతనోత్సాహాన్ని నింపిందని పేర్కొంటూ శనివారం సాయంత్రం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ?గత పార్లమెంట్ సమావేశాల్లోనే నీట్ పేపర్ లీకేజీపై సమగ్ర చర్చ జరగాలని లోక్‌సభ ప్రధాన ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ గట్టిగా డిమాండ్ చేసినప్పటికీ, కేంద్ర ప్రభుత్వం మాత్రం ఎలాంటి తప్పు జరగనట్లుగా అహంభావంతో వ్యవహరించిందని ఎంపీ రఘురాం రెడ్డి మండిపడ్డారు. దేశవ్యాప్తంగా లక్షలాది మంది విద్యార్థులు ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద తీవ్ర ఆందోళనలు చేపట్టినా, రాహుల్ గాంధీ స్వయంగా ప్రధానమంత్రి నివాసం ముందు ధర్నా నిర్వహించినా... కేంద్ర ప్రభుత్వం విద్యార్థులు, ప్రతిపక్షాలు, ప్రజల డిమాండ్లను ఏమాత్రం పట్టించుకోలేదని విమర్శించారు. ఎట్టకేలకు విద్యార్థులు, రాహుల్ గాంధీ సంయుక్త పోరాటాల ఫలితంగానే కేంద్ర ప్రభుత్వం, నరేంద్ర మోదీ తొలిసారిగా దిగివచ్చి రాజీనామాను స్వీకరించాల్సి వచ్చిందని ఆయన గుర్తుచేశారు.

**కేవలం రాజీనామాతో సరిపోదు.. సమగ్ర చర్చ జరగాలి**

?కేవలం కేంద్ర మంత్రి రాజీనామాతో ఈ సమస్యకు పూర్తి పరిష్కారం లభించదని, దీనిపై పార్లమెంట్‌లో లోతుగా చర్చ జరగాలని ఎంపీ డిమాండ్ చేశారు. భవిష్యత్తులో ఇలాంటి పేపర్ లీకేజీ ఘటనలు పునరావృతం కాకుండా కేంద్ర ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని, జాతీయ స్థాయి పోటీ పరీక్షలన్నింటినీ అత్యంత పారదర్శకంగా నిర్వహించాలని ఆయన డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం ఇకనైనా అహంభావాన్ని వీడి ప్రతిపక్ష పార్టీలకు, ప్రజల ఆకాంక్షలకు సముచిత ప్రాధాన్యత ఇవ్వాలని రఘురాం రెడ్డి హితవు పలికారు.



## ఓటు హక్కు రాజ్యాంగం కల్పించిన అమూల్యమైన శక్తి
## నేనావత్ బాలు నాయక్

**చింతపల్లి, జులై 25(జనంసాక్షి)** ఓటు హక్కు రాజ్యాంగం కల్పించిన అమూల్యమైన శక్తిఅని దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ అన్నారు. చింతపల్లి మండలం మల్లారెడ్డిపల్లి గ్రామంలో నిర్వహించిన ఓటరు జాబితా ప్రత్యేక సవరణ సర్ అవగాహన కార్యక్రమంలో దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఓటు హక్కు ప్రతి పౌరుడికి రాజ్యాంగం కల్పించిన అత్యంత విలువైన హక్కు అని పేర్కొన్నారు. అర్హులైన ఒక్క ఓటరి పేరు కూడా జాబితా నుంచి తొలగిపోకుండా బిఎల్‌ఏలు, బిఎల్వోలు, కాంగ్రెస్ నాయకులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. గ్రామ సర్పంచ్ నల్ల సుమిత రఘుమారెడ్డి మాట్లాడుతూ ఓటర్ జాబితా ప్రక్రియ ను నిర్లక్ష్యం చేయకుండా ప్రజలు స్వయంగా ముందుకు వచ్చి తమ వివరాలు సరిచేసుకోవాలని కోరారు.

ప్రతి ఇంటికి వెళ్లి ఓటర్ల వివరాలను పరిశీలించి అవసరమైన పత్రాలను సకాలంలో సమర్పించేలా ప్రజలకు అవగాహన కల్పించాలని తెలిపారు. ప్రతి బూత్‌లో 100 శాతం సర్ ప్రక్రియ పూర్తి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో

తహసిల్దార్ విజయలక్ష్మి ఆర్ ఐ సునిత, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు నల్ల రఘుమారెడ్డి,మార్కెట్ చైర్మన్ సంజీవ రెడ్డి, డీసీసీ ప్రధాన కార్యదర్శి ఎరుకల వెంకటయ్య గౌడ్, మండల పార్టీ అధ్యక్షులు హరి నాయక్ , వైస్ చైర్మన్ సుధాకర్ రెడ్డి, చింతపల్లి సర్పంచ్ కాసారపు శ్రీనివాస్, నాగభూషణం, నర్సింహా,గ్రామ వార్డ్ మెంబర్ లు,గ్రామ సెక్రటరి, బిఎల్‌ఎ లు, బిఎల్వోలు తదితరులు పాల్గొన్నారు...

# బివికె ఆధ్వర్యంలో కుట్టు మిషన్స్ పంపిణీ



**ఖమ్మం కార్పొరేషన్ జూలై 25 ( జనంసాక్షి)**
స్థానికఖమ్మం మంచికంటి హాల్ నందు బివికె ఆధ్వర్యంలో రెండవ విడత కుట్టు మిషన్లు పంపకం జరిగింది. ఈ సందర్భంగా జరిగిన సభలో నన్నక గోవిందరావు అధ్యక్షతన జరిగిన సభలో విశిష్ట అతిధి బి.వి.కె ట్రస్టు జనరల్ మేనేజర్ వై శ్రీనివాసరావు మరియు ముఖ్య అతిథిగా విచ్చేసిన బి.వి.కె ట్రస్టు ప్రధాన కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు మాట్లాడుతూ ఈ ట్రస్టు ద్వారా గత 20 సంవత్సరాలుగా అనేక సేవా కార్యక్రమాలు మరియు ఉచిత కుట్టు మిషన్, ఉచిత యోగాలు మరియు కంప్యూటర్ కేంద్రాలు నడపటం తమకు గర్వంగా ఉన్నదని వీటికి సహకరించే ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలియచేశారు. మహిళలకు ప్రత్యేకంగా కుట్టు మిషన్ల ద్వారా తమ ఆర్థిక సాధికారతను× సాధించేందుకు ఉపయోగపడే విధంగా ఉంటుందని ఈ కార్యక్రమంలు చేపడుతున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కుట్టు మిషన్ల మహిళా టీచర్ పి ప్రమీల, ఖమ్మం జిల్లా వివిధ ట్రస్టుల నిర్వాహకులు డి సుధాకర్,వాసిరెడ్డి దయానంద్,పసుమర్తి రంగారావు, పెన్షనర్స్ సంఘం అధ్యక్ష-కార్యదర్శులు గోపీచంద్ -నెల్లూరు వీరబాబు, పారుపల్లి ఝాన్సీ కుమారి తదితరులు మాట్లాడారు.వేదిక మీదకు వక్తలను బివికె సెంటర్ కార్యదర్శి ఎస్ కె అఫ్జల్ ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో వాసిరెడ్డి వీరభద్రం, టి వెంకట్రావ్,సామినేని నాగేశ్వరరావు, జి రామారావు, జాన్ , పుల్లయ్య, పి రామకృష్ణ,టి శివనారాయణ, భాస్కరరావు, జి శ్రీదేవి, రమా శేఖరం, స్వామి మరియు కుట్టు మిషన్లు నేర్చుకున్న మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. పోట్ల లక్ష్మయ్య చారిటబుల్ ట్రస్టు ప్రవీణ్ మరియు ఎన్ ఆర్ ఐ పేరెంట్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షరాలు కె హిమబిందు సహకారంతో మిషన్లు ఇవ్వడం జరిగింది.

# ఎలుగుబంటి మృతి కేసులో ముగ్గురు నిందితులు అరెస్ట్



కల్లూరుజూలై 25(జనం సాక్షి)
ఎలుగుబంటి మృతి కేసులో ముగ్గురు నిందితులను అరెస్ట్ చేసి సత్తుపల్లి కోర్టు లో హాజరు పరిచ్చినట్లు తల్లాడ ఫారెస్ట్ రేంజ్ అధికారి జీ. ఉమ తెలిపారు. ఈ సందర్భంగా సంఘటనకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. తల్లాడ ఫారెస్ట్ రేంజ్ పరిధి కల్లూరు మండలం పడమర లోకారం రిజర్వ్ ఫారెస్ట్, లోకారం సౌత్ బీట్, కంపార్ట్మెంట్ నెం.127లో విశ్వసనీయ సమాచారం మేరకు అటవీ అధికారులు సంఘటనా స్థలానికి చేరుకుని తనిఖీ నిర్వహించారు. అక్కడ బద్ధ ఎలుగుబంటి మృతి చెందిన స్థితిలో గుర్తించారు. సంఘటనా స్థలాన్ని పరిశీలించగా ఎలుగుబంటిని వేటాడనీకి ఉపయోగించిన మెటీరియల్ వెదురు పొదలో సుమారు 2.20 కిలోల బైండింగ్ వైర్ కాయిల్ స్వాధీనం చేసుకున్నారు. సంఘటనా స్థలంలోనే పంచనామా నిర్వహించి, కల్లూరు పశు వైద్యాధికారి ,ద్వారా పోస్టుమార్టం నిర్వహించబడింది. పోస్టుమార్టం నివేదిక ప్రాథమిక దర్యాప్తులో, విద్యుత్ లైన్లను అక్రమంగా ఉపయోగించి వేటాడటం వల్ల ఎలుగుబంటి విద్యుత్ షాక్కు గురై మృతి చెందినట్లు నిర్ధారణ అయింది.ఈ ఘటనపై అటవీ శాఖ అధికారులు వేగంగా దర్యాప్తు చేపట్టి, సంఘటనకు బాధ్యులైన ముగ్గురు నిందితులను గుర్తించి . అజ్మీరా నాగరాజు , దేవానబోయిన వెంకట నరసింహారావు , అజ్మీరా రమేష్ , నిందితులపై వన్యప్రాణి సంరక్షణ చట్టం, 1972 క్రింద అరెస్ట్ చేసినట్లు తెలిపారు. ఇతర సంబంధిత చట్టాల కింద కేసు నమోదు చేసి, సత్తుపల్లి న్యాయస్థానం ముందు హాజరు పరిచినట్లు .తల్లాడ ఫారెస్ట్ రేంజ్ అధికారి జీ. ఉమ తెలిపారు ఈ సందర్భంగా మాట్లాడుతు అటవీ శాఖ వన్యప్రాణుల సంరక్షణకు అత్యంత ప్రాధాన్యత ఇస్తుందని, విద్యుత్ లైన్ల ద్వారా వేట, విషప్రయోగం, ఉచ్చులు ఏర్పాటు చేయడం వంటి అక్రమ చర్యలకు పాల్పడిన వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వన్యప్రాణుల రక్షణలో ప్రజలు సహకరించాలని, అనుమానాస్పద కార్యకలాపాలు గమనించిన వెంటనే సమీప అటవీ అధికారులకు సమాచారం అందించాలని కోరారు . ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్లు ,జీ . సురేష్ కుమార్,బాలాజీ ,ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్, కిషోర్ కుమార్, ఫారెస్ట్ బీట్ ఆఫీసర్లు యమ్ డి. అజాం అలీ, సిద్ధరావు, ఉమా మహేశ్వర రావు, శ్రీకాంత్, భీమా పాల్గొన్నారు.

## విద్యార్థుల భవిష్యత్తుకు తల్లిదండ్రుల

# భాగస్వామ్యమే బలమైన పునాది

### సెయింట్ జోసెఫ్ పాఠశాలలో ఘనంగా

### ఓపెన్ పేరెంట్,టీచర్ సమావేశం







**చంద్రుగొండ, జూలై 25 (జనంసాక్షి):**
విద్యార్థుల భవిష్యత్తుకు తల్లిదండ్రుల భాగస్వామే బలమైన పునాది అని సెయింట్ జోసెఫ్ పాఠశాల ప్రిన్సిపాల్ సిస్టర్ లతా అభిప్రాయపడ్డారు.
చంద్రుగొండ మండలం అయ్యన్నపాలెం గ్రామంలోని సెయింట్ జోసెఫ్ పాఠశాలలో శనివారం ఓపెన్ పేరెంట్?టీచర్ సమావేశం ఘనంగా నిర్వహించారు. విద్యార్థుల విద్యా ప్రగతి, క్రమశిక్షణ, నైపుణ్యాల పెంపు, పాఠశాల అభివృద్ధి వంటి కీలక అంశాలపై ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పరస్పరం అభిప్రాయాలు పంచుకోవడం ఈ సమావేశం ప్రధాన ఉద్దేశ్యంగా నిలిచింది.ఈ సమావేశానికి పెద్ద సంఖ్యలో తల్లిదండ్రులు హాజరై తమ పిల్లల విద్యాభ్యాసంలో మరింత మెరుగైన ఫలితాలు సాధించేందుకు అవసరమైన సూచనలు, సలహాలు అందించారు. విద్యార్థుల చదువుపై నిరంతర పర్యవేక్షణ, ఇంటి వద్ద అధ్యయన వాతావరణం కల్పించడం, నైతిక విలువలు పెంపొందించడం, సమయపాలన, క్రమశిక్షణ వంటి అంశాల్లో తల్లిదండ్రులు-ఉపాధ్యాయుల సమన్వయం ఎంతో అవసరమని అభిప్రాయపడ్డారు. అదేవిధంగా పాఠశాల అభ్యున్నతికి అవసరమైన మౌలిక సదుపాయాల మెరుగుదల, విద్యార్థులకు నాణ్యమైన బోధన, వ్యక్తిత్వ వికాసానికి దోహదపడే కార్యక్రమాల నిర్వహణపై తల్లిదండ్రులు తమ విలువైన సూచనలు చేశారు. వాటిని పాఠశాల యాజమాన్యం శ్రద్ధగా నమోదు చేసుకుని, సాధ్యమైనంత త్వరగా అమలు చేసే దిశగా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చింది.ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ సిస్టర్ లత మాట్లాడుతూ, విద్యార్థుల సమగ్ర అభివృద్ధికి తల్లిదండ్రుల సహకారం అత్యంత కీలకమని పేర్కొన్నారు. పాఠశాల-తల్లిదండ్రుల మధ్య పరస్పర విశ్వాసం, నిరంతర సంభాషణ ఉంటేనే విద్యార్థులు విద్యతో పాటు విలువలతో కూడిన వ్యక్తులుగా ఎదుగుతారని తెలిపారు. .ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ సిస్టర్ లతా, కరస్పాండెంట్ సిస్టర్ మార్టినా , కోఆర్డినేటర్ షాహిద్ ఆఫ్రిది, ఉపాధ్యాయ బృందం, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# ఢిల్లిలో విద్యార్థులపై జరిగిన దాడులు అమానుషం

**◆పాల్వంచ తెలంగాణా ఉద్యమకారులు సంఘీభావం..**

**◆విరాళాల రూపంలో విద్యార్థుల ఆహారానికి సహకరించండి..**





**కొత్తగూడెం క్రైమ్, జూలై 25, (జనంసాక్షి)**
కాక్రోచ్ జనతా పార్టీ ఆధ్వర్యంలో నీట్ పేపర్ లీకేజ్ వ్యవహారంలో అన్ని రాష్టాల లక్షల మంది విద్యార్థులు జంతర్ మంతర్ వద్ద చెపట్టిన శాంతి నిరసన కార్యక్రమంలో లాఠీ చార్జీలు చేపట్టధం,భాష్పవాయువు ప్రయోగించి మానసికంగా హిసించడం అమానుష చర్య అని, రాళ్లతో తీవ్రంగా గాయపడి అసువులు బాసిన విద్యార్థులకు సంఘీభావం ప్రకటించిన పాల్వంచ తెలంగాణా ఉద్యమకారులు, మేధావులు, ప్రజాస్వామిక వాదులు. శనివారం పాల్వంచ అమరవీరుల స్థూపం వద్ద ఉద్యమకారుడు బరగడి దేవదానం అధ్యక్షతన జరిగిన సంఘీభావ సమావేశంలో వక్తలు మాట్లాడుతూ ప్రజాస్వామ్య దేశంలో రాజ్యాంగ బద్ధంగా నిరసన తెలియచేసే హక్కు ప్రతి పౌరునికి ఉందని,నీట్ పేపర్ లీకేజ్ వ్యవహారంలో విద్యార్థులు చేపట్టిన నిరసన కార్యక్రమాన్ని హింసాత్మక చర్యగా పురికొల్పిన కేంద్ర ప్రభుత్వంపై, ఢిల్లి పోలీసుల చర్యలను ఖండించారు.శాంతి యుతంగా నిర్వహిస్తున్న విద్యార్థుల నిరసన ర్యాలీని హింసాత్మకంగా మార్చి, విద్యార్థులను దేశ ద్రోహూలుగా, విదేశీయులుగా చిత్రీకరించడం ప్రక్కదోవ పట్టించుటకు ప్రభుత్వం ఆడుతున్న డ్రామా అని కొట్టిపారేసారు. విదేశీయులు భారతదేశంలో జొరబడితే నిఘా వ్యవస్థ ఏమైందని ప్రశ్నించారు. విద్యపై దాడి గా అభివర్ణించారు.కష్టపడి నీట్ పరిక్షలకు ప్రిపేర్ అయ్యే విద్యార్థులు, లీకేజ్ ల వల్ల ధనవంతులు సుశిక్షుతులు కాని డాక్టర్ల వల్ల సమాజం ఏమౌతుందో ఆలోచించాలని ఇలాంటి వాటిని ప్రోత్సహిస్తున్న ప్రభుత్వాలను ఎండగట్టవలసిన ఆవశ్యకత వుందని తెలిపారు. గతంలో నీట్ పరిక్షలు ఏ రాష్ట్ర పరిధిలో ఆయా రాష్ట్రాలు నిర్వహించుకొనేవని ఆ విధానం వలల విద్యార్థులకు ఎవరికి నష్టం లేకుండ పారదర్శికంగా ర్యాంకులు వచ్చేవని పాత విధానమే మేలని సూచించారు. దేశంలో, రాష్ట్రాలలో పార్టీలకు అతీతంగా విద్యార్థులు, సామాజిక కార్యకర్తలు విద్యారైథులపై జరిపిన దమన కాండకు నిరసనగా రోడ్డు ఎక్కుతున్నారని వారందరికి సంఘీభావం ప్రకటిస్తున్నామని తెలిపారు. పాల్వంచ పారిశ్రామిక ప్రాంతంలో స్వచ్ఛందంగా వుందుకు వచ్చి ఢిల్లీలో విద్యార్థులకు ఆహార ఖర్చులు నిమిత్తం విరాశాలు అందచేయాలని సూచించారు.కేంద్ర విద్యాశాఖ మంత్రిని పదవి నుండి తొలగించాలని, మరణించిన విద్యార్థులకు కేంద్ర ప్రభుత్వం కోటి రూపాయల ఎక్స్గ్రేషియాను అందించాలని, కుటుంబంలో ఒకరికి ఉద్యోగ అవకాశం కల్పించాలని, సోనమ్ వాంగ్ చుక్, విద్యార్థులను అక్రమంగా అరెస్ట్ చేసి నిర్భంధించిన వారిని విడుదల చేయాలని వారిపై వున్న అన్ని పోలీస్ కేసులను రద్దు చేయాలిని డిమాండ్ చేసారు.రెండు మూడు రోజుల్లో పాల్వంచ లో పార్టీలకు అతీతంగా విద్యార్థులకు సంఘీభావంగా పెద్ద ఎత్తున చేపట్టబోయే కార్యక్రమ రూపకల్పనకు అందరు సహకరించాలని తెలిపారు.సమావేశానికి ముందుగా అమరులైన విద్యార్థులకు రెండు నిమిషాలు మౌనం పాటించారు. ఈ కార్యక్రమం లో చిటికెన ముసలయ్య, శనగ వెంకటేశ్వర్లు, మంజూర్,యండి రషీద్, నబీ సాహెబ్, యస్డీటీ హుస్సేన్, ఫారెస్ట్ శంకరన్న, కుడికాల ఆంజనేయులు, రవీందర్, శ్రీనివాస్, అజీజ్,వాసు, రాములు, శనగ రామచందర్ రావు తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులు చిన్నతనం నుంచే న్యాయవిజ్ఞానం కలిగి ఉండాలి

## అదనపు జూనియర్ సివిల్ జడ్జి వి.రత్నకుమారి

**రామన్నపేట, జూలై 25 (జనంసాక్షి):** విద్యార్థులు చిన్నతనం నుంచే చట్టాలు, హక్కులు, బాధ్యతలపై అవగాహన కలిగి ఉండాలని అదనపు జూనియర్ సివిల్ జడ్జి వి. రత్నకుమారి పేర్కొన్నారు. శనివారం మండల పరిధిలోని ఎన్నారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నందు మండల న్యాయ సేవ అధికార సంస్థ రామన్నపేట ఆధ్వర్యం లో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా అదనపు జూనియర్ సివిల్ జడ్జి వి.రత్నకుమారి హాజరయ్యారు. పాఠశాల ఇంచార్జీ ప్రధానో పాధ్యాయులు రమాబాయి అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమాన్ని ఉద్దేశించి మాట్లాడుతూ విద్యార్థులు అన్ని రంగాలలో ముందు ఉండాలని, వారికి తల్లిదండ్రుల ప్రోత్సాహం తప్పని సరిగా ఉండాలని అన్నారు. విద్యా వ్యవస్థ వల్లనే ప్రపంచాన్ని మార్చే అవకాశం ఉంటదని, ఎలాంటి సమస్యలు వచ్చిన వెంటనే పరిష్కారం దిశగా అడుగులు వేయాలని సూచించారు. అందరూ పలు రకాల చట్టాలపై అవగాహన




పొందాలని, విద్యా హక్కు చట్టం, బాలకార్మిక నిరోధక చట్టం, బాల్యవివాహాలు, ఫోక్సో చట్టం, లేబర్ చట్టాలు, మాదక ద్రవ్యాలు, అన్ని రకాలుగా ఎలాంటి సమస్య వచ్చిన చట్టాలపై అవగాహన పెంచుకోవాలన్నారు. విద్యార్థు లకు గాని, పెద్దలకి గాని, వృద్ధులకు గాని ఏ సమస్య ఎదురైన వెంటనే స్థానిక పోలీస్ స్టేషన్లలో గానీ, మండల స్థాయిలో ఉన్న న్యాయ సేవ అధికార సంస్థ దృష్టికి గాని తీసుకురావాలని, ఎవరు కూడా అధైర్య పడవద్దని సూచించారు. చెడు దారి పట్టించే ఆలోచనలు పక్కకి నెట్టేసి, మంచి నిర్ణయాలు తీసుకునే విధంగా ఉండాలని అన్నారు. సమాజంలో మన హక్కులు, బాధ్యతలు నిర్వహణలో భాగస్వామ్యులు కావాలన్నారు. ఈ కార్యక్రమంలో రామన్నపేట బార్ అసోసియేషన్ అధ్యక్షులు ఎంఏ మజీద్, ప్యానల్ అడ్వకేట్ కూనూరు శ్రీనివాస్, అడ్వకేట్ పాల్వంచ జగతయ్య, లీగల్ సర్వీసెస్ టీమ్ సభ్యులు బత్తుల గణేష్, అగ్రీ క్లినిక్ సభ్యులు కానుగంటి శ్రీశైలం, అధ్యా పక బృందం, విద్యారులు, కోర్టు సిబ్బంది, పోలీస్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



# మండల కేంద్రంలో అధికారుల సమీక్ష సమావేశం

**మాడుగులపల్లి, జూలై 25 (జనం సాక్షి):** నల్లగొండ జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు, శనివారం మాడుగులపల్లి మండల కేంద్రంలోని మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో మండల ప్రత్యేక అధికారి సాహితి అధ్యక్షతన ఉన్నత స్థాయి సమీక్ష సమావేశం నిర్వహించారు ఈ సమావేశంలో మండలంలోని వివిధ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల పురోగతిపై సుదీర్ఘంగా చర్చించారు ఈ సమావేశంలో ప్రధానంగా తాగునీటి సరఫరా నిరంతరం అందేలా చూడటం, వర్షపు నీటి సంరక్షణకు ఇంకుడు గుంతల ఏర్పాటు, వ్యవసాయం – ఉద్యానవన శాఖల ద్వారా రైతులకు అందుతున్న సేవలపై సమీక్ష నిర్వహించారు అలాగే ప్రతిష్టాత్మకంగా చేపట్టిన వనమహోత్సవం కార్యక్రమంలో భాగంగా ప్రతి గ్రామంలో విరివిగా మొక్కలు నాటి, వాటిని సంరక్షించాలని అధికారులను ఆదేశించారు.మండలంలో గుడిసెల స్థితిగతుల ధృవీకరణ, స్వచ్ఛ భారత్ మిషన్ ( ఎస్బీమ్) ద్వారా పారిశుద్ధ్య నిర్వహణ, జాతీయ కుటుంబ ప్రయోజన పథకం ( ఎన్నో ఎఫ్బి ఎస్ ఎస్) అమలు, సార్ అంశాలు గ్రామ సంఘం (వివో) భవనాల నిర్మాణ పనుల ప్రగతిని అడిగి తెలుసుకున్నారు పెండింగ్‌లో ఉన్న పనులను త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు ఈ సమావేశంలో మండల ప్రత్యేక అధికారి సాహితి, మండల పంచాయతీ అధికారి టీ. సంగీత, మండల రెవెన్యూ అధికారి ఎస్. సరోజ పావని , ఏఈపీఆర్ మధు, ఆర్డబ్ల్యూఎస్ ఏఈ ప్రసాద్, ఏపీఓ శ్రీనివాస్ రెడ్డి, ఏపీఎం మధు, హౌసింగ్ ఏఈ సౌమ్య, ఏఈఓ నితిన్ మండల పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

# గెజిటెడ్ అధ్యాపకుల సంఘం జిల్లా కార్యదర్శిగా డాక్టర్ డి. కిషన్



**రామన్నపేట, జూలై 25 (జనంసాక్షి):** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ కళాశాలల గెజిటెడ్ అధ్యాపకుల సంఘం యాదాద్రి భువనగిరి జిల్లా కార్యదర్శిగా స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల చరిత్ర విభాగంలో అసిస్టెంట్ ప్రొఫెసర్ గా విధులు నిర్వహిస్తున్న డాక్టర్ డి. కిషన్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. శనివారం నిర్వహించిన జిల్లా కమిటీ ఎన్నికల్లో ఆయనను సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. డాక్టర్ డి. కిషన్ గతంలో కూడా జిల్లా అధ్యక్షుడిగా, జిల్లా కార్యదర్శిగా పనిచేసి మూడవ పర్యాయం మళ్లీ జిల్లా కార్యదర్శిగా ఏకగ్రీవంగా ఎన్నికైన సందర్భంగా కళాశాల ప్రధానాచార్యులు ఆచార్య రాహత్ ఖానం అభినందించారు. నిరంతరం సభ్యుల సమస్యల పరిష్కారం చేయడంలో ముందుండాలని, ప్రభుత్వ విద్యారంగ అభివృద్ధి కోసం పాటుపడాలని ఆమె కోరారు. ఈ సందర్భంగా అధ్యాపకులు, కార్యాలయ సిబ్బంది కిషన్ కు శు భాకాంక్షలు తెలిపారు.



# రైస్ మిల్లు బూడిద కాలుష్యంతో ప్రజలకు ఇబ్బందులు

**హుజూర్‌నగర్, జూలై 25, (జనంసాక్షి) :** పట్టణంలోని మిర్యాలగూడ రోడ్డులోని శ్రీలక్ష్మి గణేష్ ఫార్ బాయిల్డ్ మోడ్రన్ రైస్ మిల్లు నుండి వెలువడుతున్న బూడిద, పొట్టు కాలుష్యంతో పరిసర కాలనీ వాసులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు అన్నారు. మిల్లు యాజమాన్యం నిబంధనలకు విరుద్ధంగా పొట్టు గది, బూడిద గది లేకుండా కాలుష్యాన్ని బహిరంగంగా వదులుతున్నారని స్థానికులు ఆరోపించారు. గత నెల రోజులుగా విచ్చలవిడిగా బూడిదను బయటకు వదలడం వల్ల వాహనదారుల కళ్లల్లో బూడిద పడి రోడ్డు ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. మిల్లుకు కనీసం ప్రహరీ గోడ కూడా లేదు. గత 15 రోజుల క్రితం బాధితులు మున్సిపల్ కమిషనర్ సతీష్ కు ఫిర్యాదు చేయడంతో ఆయన స్థలాన్ని పరిశీలించి కాలుష్య నివారణ చర్యలు తీసుకోవాలని మిల్లు యజమానిని హెచ్చరించారు. శనివారం పరిసర కాలనీ వాసులు మిల్లు వద్దకు చేరుకుని యాజమాన్యాన్ని నిలదీశారు. మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు పోలిశెట్టి నరసింహారావు, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు గెల్లి రవి అక్కడికి చేరుకుని 15 రోజుల్లో అన్ని నివారణ చర్యలు తీసుకోవాలని యాజమాన్యానికి సూచించి బాధితులను శాంతింపజేశారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు యడ్ల విజయ్, శ్రీమన్నారాయణ, నాగేశ్వరరావు, ఆంజనేయులు, లాలయ్య, నరసింహ, శంకర్ రావు, బుజ్జి తదితరులు పాల్గొన్నారు.

# బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు పాశం గోపాల్ రెడ్డి ఆధ్వర్యంలో నాగార్జునసాగర్‌లో ప్రత్యేక పూజలు

**గుర్రంపోడు జూలై 25 (జనంసాక్షి)** నాగార్జునసాగర్ డ్యాం కింద ప్రవహిస్తున్న పవిత్ర కృష్ణానదిలో ఈరోజు భక్తిశ్రద్ధలతో పవిత్ర స్నానమాచరించి, అనంతరం సమీపంలోని శ్రీ శివాలయంలో స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు స్వామివారికి అభిషేకం, అర్చనలు నిర్వహించి కుటుంబ సభ్యుల ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలు, శాంతి, ఐశ్వర్యాలు కలగాలని ప్రార్థించారు.పూజా కార్యక్రమాలు అనంతరం ఆలయ అర్చకులు వేదమంత్రాల నడుమ భక్తులకు స్వామివారి ఆశీస్సులు అందించి తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు. ఆధ్యాత్మిక వాతావరణంలో జరిగిన ఈ కార్యక్రమంలో పాల్గొన్న భక్తులు శివుని దర్శనం చేసుకోవడం తమ జీవితంలో ఎంతో ఆనందదాయకమైన, పుణ్యప్రదమైన అనుభూతిగా పేర్కొన్నారు.ఈ పవిత్ర కార్యక్రమంలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు పాశం గోపాల్ రెడ్డి , మాజీ సర్పంచ్ శ్రీమతి పాశం అలివేలమ్మ , మంద పుష్పలత, మనవరాలు శ్రీ సాహితి పాల్గొన్నారు. అందరూ కలిసి స్వామివారి దర్శనం చేసుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొని తీర్థప్రసాదాన్ని స్వీకరించారు.ఈ సందర్భంగా పాశం గోపాల్ రెడ్డి మాట్లాడుతూ, నాగార్జునసాగర్ క్షేత్రం ఆధ్యాత్మిక విశిష్టత కలిగిన పవిత్ర ప్రాంతమని, ప్రతి ఒక్కరూ ఇలాంటి పుణ్యక్షేత్రాలను సందర్శించి దైవానుగ్రహం పొందాలని ఆకాంక్షించారు. భక్తి, విశ్వాసాలతో దేవుడిని ప్రార్థిస్తే సమాజంలో శాంతి, సౌభ్రాతృత్వం, సుఖసంతోషాలు నెలకొంటాయని ఆయన అన్నారు.ఈ కార్యక్రమం భక్తిపూర్వక వాతావరణంలో ఘనంగా నిర్వహించబడగా, పాల్గొన్న భక్తులు శివుని కృప అందరిపై ఉండాలని కోరుకుంటూ “ఓం నమః శివాయ” అంటూ తమ భక్తి భావాన్ని వ్యక్తం చేశారు.



# డాగ్ స్క్వాడ్‌తో పోలీసుల సోదాలు మత్తు పదార్థాల కోసం జల్లెడ

**కొండమల్లేపల్లి, జులై 25 (జనంసాక్షి):** శాంతిభద్రతల పరిరక్షణతో పాటు యువతను మత్తు పదార్థాల బారిన పడకుండా కాపాడేందుకు జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ ఐపీఎస్ ఆదేశాల మేరకు దేవరకొండ ఎస్ హెచ్ ఓ ఆధ్వర్యంలో శనివారం పోలీసు సిబ్బంది ప్రత్యేక డాగ్ స్క్వాడ్ తో ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా అనుమానాస్పద వ్యక్తులు, వాహనాలు, దుకాణాలను తనిఖీ చేసి నిషేధిత మత్తు పదార్థాల అక్రమ రవాణా, విక్రయాలపై నిఘా పెట్టారు. మత్తు పదార్థాల వినియోగం, విక్రయం లేదా రవాణాకు సంబంధించిన సమాచారం తెలిసిన వెంటనే పోలీసులకు తెలియజేయాలని ప్రజలను కోరారు. సమాజంలో మత్తు పదార్థాలకు తావులేకుండా ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని పోలీసులు సూచించారు.



# కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా హర్షణీయం

## డిసిసి ప్రధాన కార్యదర్శి మేకల రాజేందర్ రెడ్డి



**కొండమల్లేపల్లి, జులై 25 (జనంసాక్షి):** జాతీయ ప్రవేశ పరీక్షల్లో చోటుచేసుకున్న అక్రమాలు ప్రశ్నాపత్రాల లీకేజీ వ్యవహారంపై దేశవ్యాప్తంగా కాంగ్రెస్ అగ్రనేత, ప్రధాన ప్రతిపక్ష నాయకులు రాహుల్ గాంధీతో పాటు విద్యార్థి సంఘాలు, విద్యార్థులు తీవ్ర నిరసనలు మిన్నంటిన నేపథ్యంలో కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ శనివారం తన పదవికి రాజీనామా చేశారు. రాహుల్ గాంధీతో పాటు పలు విద్యార్థి సంఘాలు చేపట్టిన సుదీర్ఘ ఆందోళనలు విద్యాశాఖ జవాబుదారీతనం వహించాలనే తీవ్ర ఒత్తిడి మధ్య కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా ప్రకటించడం యువత విజయమని డిసిసి ప్రధాన కార్యదర్శి మేకల రాజేందర్ రెడ్డి అన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశవ్యాప్తంగా పేపర్ లీక్‌లను అరికట్టేందుకు కేంద్ర ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని అన్నారు. పేపర్ లీక్‌లను నియంత్రించేందుకు ప్రత్యేక ఫాస్ట్‌ట్రాక్ కోర్టులు, ప్రత్యేక టాస్క్‌ఫోర్స్ ఏర్పాటు చేసేలా కొత్త చట్టాన్ని తీసుకురావాలని తెలిపారు. ఇటీవల నీట్ వ్యవహారంపై దేశంలోని పలు ప్రాంతాల్లో విద్యార్థులు నిరసనలు చేపట్టారు. ఢిల్లీ జంతర్ మంతర్ సహా అనేక ప్రాంతాల్లో ఆందోళనలు కొనసాగాయి. విద్యార్థుల న్యాయం కోసం రాహుల్ గాంధీతో పాటు వివిధ సంఘాలు కూడా ఉద్యమించడం హర్షణీయమని మేకల రాజేందర్ రెడ్డి అన్నారు. యువతకు కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందని అన్నివర్గాల అభివృద్ధి కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యం అన్నారు.

జనంసాక్షి

# ప్రతి ఒక్కరు సేవా గుణాన్ని కలిగి ఉండాలి

**సూర్యాపేట(జనంసాక్షి):**



ప్రతి ఒక్కరు సేవా గుణాన్ని కలిగి ఉండాలని సూర్యాపేట మున్సిపాలిటీ 14వ వార్డు కౌన్సిలర్ గాలి సాయికిరణ్ అన్నారు. జిల్లా కేంద్రంలోని కొత్త బస్టాండ్ ఫ్లై ఓవర్ వద్ద బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ పుట్టినరోజు, తన పుట్టినరోజు సందర్భంగా అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్నిదానాల కన్నా అన్నదానమే గొప్పదని అన్నారు. సమాజానికి ఉపయోగపడే సేవా కార్యక్రమాలతో పుట్టినరోజు వేడుకలు జరుపుకోవడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. ఇలాంటి సేవా కార్యక్రమాలు ప్రతి ఒక్కరూ చేపట్టాలని పిలుపునిచ్చారు. మాజీ మంత్రి కేటీఆర్ ఇలాంటి పుట్టినరోజులు మరెన్నో జరుపుకోవాలని, ఆయురారోగ్యాలతో ఉండాలని ఆ భగవంతుని ప్రార్థిస్తున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# ప్రత్యామ్నాయ పంటలే మేలు : వ్యవసాయ అధికారి సరిత

**హాలియా జనం సాక్షి జూలై 25**



ప్రస్తుతం ఎల్ నినో ప్రభావంతో ఈ ఏడాది సాధారణం కంటే తక్కువ వర్షపాతం నమోదవుతున్న నేపథ్యంలో, నాగార్జునసాగర్ ప్రాజెక్టులో నీటి లభ్యత కూడా తగ్గినందున రైతులు వరి సాగుకు బదులుగా ఆరుతడి పంటల సాగుపై దృష్టి సారించాలని వ్యవసాయ శాఖ సహాయ సంచాలకురాలు ఎం. సరిత సూచించారు. ఇది వర్షాభావ పరిస్థితుల్లో పంట నష్టాన్ని తగ్గించేందుకు, నీటి వనరులను సమర్థవంతంగా వినియోగించేందుకు ఉపయుక్తమని తెలిపారు. నాయుడుపాలెం గ్రామపంచాయతీ పరిధిలో గ్రామ సర్పంచ్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో, ప్రస్తుతం ప్రత్యామ్నాయ పంటలైన కంది సాగు చేస్తున్న క్షేత్రాలను సందర్శించి రైతులకు ఎల్ నినో ప్రభావం, నీటి సంరక్షణ, ప్రత్యామ్నాయ పంటల సాగుపై అవగాహన కల్పించారు. ఒక ఎకరం వరి సాగుకు అవసరమయ్యే నీటితో మూడు నుంచి నాలుగు ఎకరాల్లో ఆరుతడి పంటలు సాగు చేయవచ్చని వివరించారు. వరికి ప్రత్యామ్నాయంగా కందులు, మినుములు, నువ్వులు, కూరగాయలు వంటి పంటలను సాగు చేయాలని సూచించారు. అదేవిధంగా పేరూరు గ్రామపంచాయతీ పరిధిలో ఫార్మర్ రిజిస్ట్రేషన్ తక్కువగా నమోదు కావడం వల్ల భవిష్యత్తులో రైతులకు ప్రభుత్వ పథకాలు అందించడంలో ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం ఉందని తెలిపారు. అందుకే రైతులు తప్పకుండా ఏఈఓ వద్ద ఫార్మర్ రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కందుల మదన్మోహన్ రెడ్డి, ఒఝాలు సమీర్, సత్యనారాయణ, గ్రామ రైతులు పాల్గొన్నారు.

# బూత్ లెవెల్ ఏజెంట్లు పూర్తి బాధ్యతతో పనిచేయాలి తాటికొండ సీతయ్య

**తుంగతుర్తి, జూలై 25,(జనం సాక్షి)**



మండలంలోని 46 పోలింగ్ బూత్‌ల పరిధిలో ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (సర్) ప్రక్రియ తుది దశకు చేరుకున్న నేపథ్యంలో గడువులోగా వేగవంతంగా పూర్తి చేయాలని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు, మాజీ ఎంపీపీ తాటికొండ సీతయ్య పార్టీ బూత్ లెవెల్ ఏజెంట్లకు సూచించారు. శనివారంపార్టీ కార్యాలయంలో బీఆర్ఎస్ పార్టీ ముఖ్య నాయకులు, బూత్ లెవెల్ ఏజెంట్లతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతి బూత్ లెవెల్ ఏజెంట్ పూర్తి బాధ్యతతో వ్యవహరిస్తూ, బూత్ లెవెల్ అధికారులకు సహకరిస్తూ ఓటరు నమోదు ప్రక్రియను విజయవంతంగా పూర్తి చేయాలని కోరారు. ఇప్పటికే కొన్ని పోలింగ్ బూత్‌లలో 100 శాతం ప్రక్రియ పూర్తయిందని, మిగిలిన గొట్టిపర్తి, వెలుగుపల్లి, తుంగతుర్తి, వెంపటి, అన్నారం లాంటి ప్రధాన గ్రామాలతో పాటు కొత్తగూడెం, తూర్పుగూడెం, సంగెం తదితర గ్రామాల్లో గ్రామ ముఖ్య నాయకులతో సమన్వయం చేసుకుని అర్హులైన ప్రతి ఒక్కరి పేరును ఓటరు జాబితాలో నమోదు చేయించాలని సూచించారు. అదేవిధంగా చనిపోయిన వారి పేర్లు, డబుల్ ఓట్లు, మార్పిడి ఓట్లు వంటి అంశాలను క్షుణ్ణంగా పరిశీలించి, నిబంధనల ప్రకారం తొలగించేలా చర్యలు తీసుకోవాలని బీఎల్ఏలకు సూచించారు. ప్రతి ఓటరు వివరాలను జాగ్రత్తగా పరిశీలించి, ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా ప్రక్రియను పూర్తి చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో పార్టీ నాయకులు గుండగాని రాములు గౌడ్, మాజీ వైస్ ఎంపీపీ శ్రీశైలం యాదవ్, బూత్ లెవెల్ ఏజెంట్లు సింహాద్రి, కర్ణాకర్, రాములు, చిట్టి, సమ్మద్, మహేందర్, భాస్కర్‌తో పాటు పలువురు సర్పంచ్‌లు, గ్రామ ముఖ్య నాయకులు పాల్గొన్నారు.



తొలి ఏకాదశి సందర్భంగా జిల్లా కేంద్రంలోని వెంకటేశ్వర స్వామి వారి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన రాష్ట్ర టూరిజం డెవలప్మెంట్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డి

## 50 ఏళ్లు నిండిన గీత కార్మికులకు

# పింఛన్ మంజూరు చేయాలి

### గీత పని వారల సంఘం జిల్లా సహాయ కార్యదర్శి ఎర్ర రమేష్ గౌడ్

**రామన్నపేట, జూలై 25 (జనంసాక్షి):**



50 ఏళ్లు నిండిన కల్లుగీత కార్మికులకు పెన్షన్ మంజూరు చేయాలని గీత పని వారల సంఘం జిల్లా సహాయ కార్యదర్శి ఎర్ర రమేష్ గౌడ్ ప్రభుత్వాన్ని కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గీత పనివారలు 20 ఏళ్లు నిండిన దగ్గర నుండి తాళ్ళెక్కుతూ తమ వృత్తిలో భాగంగా 50 ఏళ్ళు వచ్చేసరికి శరీర పటుత్వం కోల్పోతుందని, నరాలు బలహీనపడి ఇతర పనులు చేసుకోవడానికి కూడా సహకరించవని అందు కోసమే 50 ఏళ్ళు నిండిన గీత కార్మికులకు పింఛన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. గీత పనివారల సంఘం ఆధ్వర్యంలో గతంలోనే జీవోను సాధించుకోవడం జరిగిందని, ఆ జీవో యొక్క విలువను గుర్తించి ప్రభుత్వం 50 ఏళ్లు నిండిన గీత పనివారలకు పింఛన్లు వెంటనే మంజూరు చేయాలని, అదేవిధంగా జీవో నెంబర్ 560 ప్రకారం గీత పనివారలకు తాటి చెట్లు ఈత చెట్ల వనం పెంపకానికి ఐదు ఎకరాల భూమి ఇవ్వాలని కోరారు. ఈ సందర్భంగా గీత పనివారల సంఘం సభ్యత్వ నమోదు కార్యక్రమం చేశారు. ఈ కార్యక్రమంలో గీత పని వారల సంఘం మండల అధ్యక్షులు గంగాపురం వెంకటయ్య, సొసైటీ అధ్యక్షులు ఎర్ర వెంకటేశం, లగ్గోని యాదయ్య, బాలగోని మల్లయ్య, కూనూరు కృష్ణ, బాలగోని నరసింహ, భూపతి నరసింహ, గోపగోని సహదేవ్ బాలగోని శంకర్, కూనూరు నరసింహ, చెరుకు శివరాజ్, గుణగంటి కన్నయ్య, ఆకిటి శంకర్ తదితరులు పాల్గొన్నారు.

# నూతన సీఐ మొలుగూరి రవిని కలిసిన ఎమ్మార్పీఎస్ నాయకులు

**రామన్నపేట, జూలై 25 (జనంసాక్షి):**

రామన్నపేట పోలీస్ స్టేషన్ నూతన సర్కిల్ ఇన్స్‌పెక్టర్ (సీఐ) గా బాధ్యతలు స్వీకరించిన మొలుగూరి రవిని జిల్లా ఎమ్మార్పీఎస్, ఎమ్ఎస్పీఎస్ నాయకులు శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు.

ఈ సందర్భంగా సీఐ కి శాలువా కప్పి, పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలియజేశారు. రామన్నపేట మండలంలో శాంతిభద్రతల పరిరక్షణతో పాటు, ప్రజా సమస్యల పరిష్కారంలో పోలీస్ శాఖ ఎల్లప్పుడూ ముందుండాలని నాయకులు ఈ సందర్భంగా కోరారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్, ఎంఎస్పిఎస్ నాయకులు మేడి శంకర్ మాదిగ, బక్రం శ్రీనివాస్ మాదిగ,ఎరసాని గోపాల్ మాదిగ,కుర్రం లింగయ్య మాదిగ,కొప్పులు చిరంజీవి మాదిగ, మందడి శశిధర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.







# తెలంగాణ జలసిరి కార్యక్రమంపై అంగడిపేట గ్రామ ప్రజలకు అవగాహన సదస్సు

**పి.ఏ.పల్లి,జూలై 25 (జనంసాక్షి)**

పి.ఏ.పల్లి మండలం అంగడిపేట గ్రామ పంచాయతీ యందు తెలంగాణ ప్రభుత్వం పంచాయతీ రాజ్ మరియు గ్రామీణ అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో చేపట్టిన తెలంగాణ జలసిరి కార్యక్రమం పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి డి ఆర్ డి ఓ పిడి శేఖర్ రెడ్డి హాజరై తెలంగాణ జలసిరి కార్యక్రమం పై అంగడిపేట గ్రామ పంచాయతీ ప్రజలకు అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ కార్యక్రమం పూర్తిగా సంఘ బంధం ఆధ్వర్యంలో జరుగుతుందని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రతి గ్రామానికి రెండు ఊట కుంటలు,ఐదు కమ్యూనిటీ సోక్ ఫీట్లు,పది బోర్వెల్ రీఛార్జ్ స్ట్రక్చర్స్,ఐదు ఫారం ఫండ్స్,రూఫ్ టాప్ రీఛార్జ్ స్ట్రక్చర్స్,ప్రతి ఇంటికి ఒక ఇంకుడు గుంత ఉండాలని అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అంగడిపేట సర్పంచ్ రమావత్ చిరంజీవి,ఎంపిడిఓ చంద్రమౌళి,ఎంపిఓ, ఏపిఓ,ఏపీఎం,టిఏ,ఈసి,సీసీలు,సంఘ బంధం సభ్యులు,తదితరులు పాల్గొన్నారు.



## భూ ఉపరితల నీటి శాతాన్ని పెంచాలి : ఎంపీడీవో సునీత

**నూతనకల్ జూలై 25( జనంసాక్షి)**
వన మహోత్సవం కార్యక్రమంలో భాగంగా మండల కేంద్రంలోని నర్సరీని శనివారం ఎంపీడీవో సునీత పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నర్సరీలో ఉన్న బోరువెల్ ను పరిశీలించి గ్రౌండ్ వాటర్ ను పెంచుకోవాలని ఉపాధి హామీ పథకంలో స్కీమ్స్ ని ఉపయోగించుకోవాలని వారు అన్నారు. ఎంజిఎన్ఆర్ఇజిఎస్ లో మొత్తం పనులు 266, పని దినాలు100 రోజులు కలవు, కేంద్ర ప్రభుత్వం ప్రస్తుతం పథకం యొక్క పేరు విబిజి రాంజి గా మార్చి మొత్తం పనులు 318, పని దినాలను125 రోజులకు పెంచడం జరిగింది.వికసిత్ భారత్ గ్యారెంటీ రోజగార్ అజవిక మిషన్ గ్రామీణ్ ద్వారా ఎల్ నినో ప్రభావం వలన వర్షాలు తక్కువ నమోదు కావటం వలన గ్రామాలలో నీటి సంరక్షణ పనులు చేపట్టాలని ప్రభుత్వం నిర్ణయించింది.

**"ప్రతి ఇంటికి ఇంకుడు గుంత, ప్రతి పంటకు పంటకుంట**
ప్రతి ఊరికి ఊటకుంట" అనే నినాదం తో పనులు చేపట్టాలని అదేవిదంగా బోర్ వెల్ రీఛార్జ్ స్ట్రక్చర్స్,రూఫ్ టాప్ హార్వెస్టింగ్ స్ట్రక్చర్స్ , పారం పాండ్స్, కమ్యూనిటీ ఇంకుడు గుంతలు, అన్ని కూడా ప్రభుత్వం నిర్దేశించిన సమయం15బిష్ట్ర ఆగస్టు లోపల పూర్తి చేయవలసిందిగా ఆదేశాలు జారిచేయటం జరిగింది.గ్రామాలలో రైతులు గ్రామప్రజలు ఈ పనులను ఉపయోగించుకోవలసిందిగా వారు తెలిపారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ మహేశ్వరం మల్లికార్జున్, ఏపీఓ శ్రీరాములు,పంచాయతీ కార్యదర్శి శర్మ, స్వరూప, లింగయ్య తదితరులు పాల్గొన్నారు.



## సీతారామ ప్రాజెక్టు పనులను వేగవంతం చేయాలి
## సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్

కల్లూరు జూలై 25(జనం సాక్షి)
కల్లూరులోని సబ్ కలెక్టర్ కార్యాలయంలో సీతారామ ఎత్తిపోతల పథకం పనుల పురోగతిపై సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్ శనివారం అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో రెవెన్యూ, నీటిపారుదల , అటవీ శాఖలకు చెందిన అధికారులతో సమీక్షించారు.భూసేకరణ ప్రక్రియ ప్రాజెక్టు పరిధిలోని కాలువలు, డిస్ట్రిబ్యూటరీల నిర్మాణానికి సంబంధించి భూసేకరణ పురోగతిని, పరిహారం పంపిణీ వివరాలను సబ్ కలెక్టర్అడిగితెలుసుకున్నారు.
రెవెన్యూ, ఇరిగేషన్, ఫారెస్ట్ అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేసి పెండింగ్లో ఉన్న క్లియరెన్సులను, భూ పరిశీలన నివేదికలను వెంటనే పూర్తి చేయాలని ఆదేశించారు. ప్రాజెక్టు పరిధిలో భూములు కోల్పోతున్న రైతులకు పరిహారం అందించడంలో ఎలాంటి జాప్యం జరగకుండా చూడాలని, స్థానిక ఫిర్యాదులను త్వరితగతిన పరిష్కరించాలని స్పష్టం చేశారు. కాలువల నిర్మాణ పనులు నిర్దేశిత కాలపరిమితిలోగా పూర్తయ్యేలా క్షేత్రస్థాయి సిబ్బంది పర్యవేక్షించాలని సూచించారు.

## గిరిజన సర్పంచ్ మృతిపైగ్భ్రాంతి..

**సమగ్ర విచారణకు డీసీసీ ఉపాధ్యక్షుడు గోడిశాల రామనాథం డిమాండ్**



**పినపాక, జూలై 25(జనం సాక్షి):**
పాల్వంచ మండలం దంతులబోరు గ్రామ గిరిజన సర్పంచ్ సిడెం వెంకటరమణ భద్రాచలంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందడం పట్ల భద్రాద్రి డీసీసీ ఉపాధ్యక్షుడు గోడిశాల రామనాథం తీవ్రగ్భ్రాంతి వ్యక్తం చేశారు. శనివారం పినపాక మండల కేంద్రంలో ఆయన మాట్లాడుతూ మృతుడి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ ఘటనపై సమగ్ర విచారణ జరిపి, వైద్యంలో నిర్లక్ష్యం లేదా అలసత్వం జరిగినట్లు తేలితే సంబంధిత ఆసుపత్రి యాజమాన్యంపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. గిరిజన ప్రాంతాల ప్రజలకు ఆసుపత్రుల్లో మానవత్వంతో, బాధ్యతాయుతంగా, సకాలంలో వైద్య సేవలు అందించాలని వైద్య సిబ్బందికి విజ్ఞప్తి చేశారు.

### కేజీబీవీ, యూఆర్ఎస్ ఉద్యోగుల
## సమస్యలు పరిష్కరించాలి
### టీఎస్యూటీఎఫ్ చింతకాని డిమాండ్

**చింతకాని, జూలై 25 (జనం సాక్షి)**
రాష్ట్ర, జిల్లా కమిటీల పిలుపు మేరకు టీఎస్యూటీఎఫ్ చింతకాని మండల శాఖ ఆధ్వర్యంలో కేజీబీవీ, యూఆర్ఎస్ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి మద్దతుగా పోస్టుకార్డుల ఉద్యమాన్ని శనివారం ప్రారంభించారు. మధ్యాహ్న భోజన విరామ సమయంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఉద్యోగులు గౌరవ ముఖ్యమంత్రికి పోస్టుకార్డుల ద్వారా తమ సమస్యలను వెంటనే పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు.ఈ సందర్భంగా టీఎస్యూటీఎఫ్ చింతకాని మండల ప్రధాన కార్యదర్శి తోటకూరి శ్రీనివాసరావు మాట్లాడుతూ, గతంలో కేజీబీవీ ఉద్యోగుల సమస్యలపై సానుకూలంగా స్పందించిన ముఖ్యమంత్రి ఇచ్చిన హామీలను అమలు చేసి ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లను నెరవేర్చాలని కోరారు.కేజీబీవీ ఉద్యోగులకు మినిమం టైమ్ స్కేల్ అమలు చేయడం, వార్షిక ఇంక్రిమెంట్లు మంజూరు చేయడం, రెగ్యులర్ ఉద్యోగులతో సమాన అవకాశాలు కల్పించడం, సమ్మె కాలపు పెండింగ్ జీతాలు వెంటనే విడుదల చేయడం, అలాగే కేర్టేకర్ల నియామకం చేపట్టాలని మండల శాఖ ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది.ఈ కార్యక్రమంలో ఎస్. అనిల్ కుమార్, పి. శంకర్ రెడ్డి, యు. నాగేశ్వరరావు, జి.డి.ఎస్.వి. రమణతో పాటు కేజీబీవీ ఉద్యోగులు, సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## తొలి 100 శాతం ఎస్ఐఆర్ పూర్తి చేసిన గ్రామంగా లక్ష్మీపురం..

**బూర్గంపహాడ్ జూలై 25 (జనంసాక్షి)**
సమగ్ర ఓటరు సవరణ ప్రక్రియ (ఎస్ ఐ ఆర్)లో భాగంగా బూర్గంపహాడ్ మండలంలోని లక్ష్మీపురం గ్రామంలో ఉన్న 225, 226 పోలింగ్ బూత్లలో 100 శాతం ఓటరు వివరాల సవరణ ప్రక్రియ విజయవంతంగా పూర్తయింది. దీంతో బూర్గంపహాడ్ మండలంలో ఎస్ఐఆర్ ప్రక్రియను పూర్తిస్థాయిలో పూర్తి చేసిన తొలి గ్రామంగా లక్ష్మీపురం నిలిచిందని ఆ గ్రామం సర్పంచ్ బాదం వెంకటేశ్వర్ రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఎస్ఐఆర్ ప్రక్రియను విజయవంతంగా పూర్తి చేయడంలో కృషి చేసిన బూత్ లెవెల్ అధికారులు వెంకమ్మ, దేవకరుణలను లక్ష్మీపురం సర్పంచ్ బాదం వెంకటేశ్వర్ల రెడ్డి శాలువాలతో ఘనంగా సత్కరించి అభినందించారు. వారి సేవలను కొనియాడుతూ అధికారులు, ప్రజాప్రతినిధులు ప్రశంసలు వ్యక్తం చేశారు.



## ఎల్ నినో ప్రభావం - నీటి కొరత పరిస్థితుల్లో
# ప్రత్యామ్నాయ పంటలు సాగు చేసుకోవాలి..
### ఉద్యాన అధికారి, మధిర డివిజన్, ఎ. విష్ణు..



**చింతకాని, జూలై 25 (జనం సాక్షి)**
చింతకాని మండలం లోని జగన్నాధపురం, మత్కేపల్లి గ్రామాల్లో అవగాహన కార్యక్రమని.ఎల్నినో ప్రభావం కారణంగా ఈ సంవత్సరం సాధారణం కంటే తక్కువ వర్షపాతం నమోదయ్యే అవకాశాలు ఉన్న నేపథ్యంలో రైతులు అధిక నీటి అవసరమయ్యే పంటల సాగుకు బదులుగా నీటి పొదుపు సాంకేతికతలను అనుసరిస్తూ ప్రత్యామ్నాయ ఉద్యాన పంటల సాగుపై దృష్టి సారించాలని ఉద్యాన అధికారి, మధిర డివిజన్, ఎ. విష్ణు సూచించారు.
ప్రస్తుత పరిస్థితుల్లో ప్రతి నీటి బొట్టును సద్వినియోగం చేసుకోవడం అత్యంత అవసరమని, ఒక ఎకరం వరి సాగుకు వినియోగించే నీటితో సుమారు ఐదు ఎకరాల వరకు ఉద్యాన పంటలు లేదా కూరగాయల సాగు చేపట్టే అవకాశం ఉందని తెలిపారు. నీటి వినియోగ సామర్థ్యాన్ని పెంచుతూ రైతులు తక్కువ పెట్టుబడితో అధిక ఆదాయం అందించే ఉద్యాన పంటలను సాగు చేయడం ద్వారా వాతావరణ మార్పుల ప్రభావాన్ని సమర్థవంతంగా ఎదుర్కోవచ్చని వివరించారు.
ప్రత్యామ్నాయ పంటల సాగులో భాగంగా బీరకాయ, సొరకాయ, దొండకాయ, కాకరకాయ, బెండకాయ, వంకాయ, టమాటా, చిక్కుడు వంటి కూరగాయల సాగును చేపట్టాలి అని సూచించారు. ఈ పంటలు తక్కువ కాలంలో దిగుబడులు ఇవ్వడంతో పాటు రైతులకు నిరంతర ఆదాయాన్ని సమకూర్చే అవకాశాలు ఉన్నాయని తెలిపారు.వాతావరణ శాఖ అంచనాల ప్రకారం రాబోయే రెండు నెలల్లో ఆశించిన స్థాయిలో వర్షపాతం నమోదయ్యే అవకాశాలు లేనందున రైతులు అధిక పెట్టుబడి అవసరమయ్యే మిరప సాగు విషయంలో అత్యంత అప్రమత్తంగా వ్యవహరించాలని కోరారు. ముఖ్యంగా మిరప సాగుకు భారీ పెట్టుబడులు అవసరమవుతాయని, నీటి కొరత ఏర్పడినట్లయితే పంట తీవ్రంగా దెబ్బతిని రైతులు ఆర్థికంగా నష్టపోయే ప్రమాదం ఉందని తెలిపారు. అందువల్ల ప్రస్తుత పరిస్థితుల్లో రైతులు అధిక రిస్క్ ఉన్న పంటలకు బదులుగా ఉద్యాన పంటలు, కూరగాయలు మరియు పండ్ల తోటల సాగుకు ప్రాధాన్యత ఇవ్వడం శ్రేయస్కరమని సూచించారు.నీటి పొదుపు చర్యల్లో భాగంగా మల్చింగ్ షీట్ వినియోగం ఎంతో ప్రయోజనకరమని తెలిపారు. ముఖ్యంగా కూరగాయలు మరియు ఇతర ఉద్యాన పంటలలో మల్చింగ్ షీట్ ఉపయోగించడం ద్వారా నేలలో తేమ ఎక్కువ కాలం నిల్వ ఉండటంతో పాటు కలుపు మొక్కల నివారణ, నీటి వినియోగం తగ్గింపు మరియు పంటల పెరుగుదల మెరుగుపడుతుందని వివరించారు. మల్చింగ్ కు ఉద్యాన శాఖ ద్వారా ఎకరానికి రూ.8,000/- సబ్సిడీ అందిస్తున్నట్లు తెలిపారు.అదేవిధంగా, తీగజాతి కూరగాయల సాగు కోసం శాశ్వత కూరగాయ పందిళ్ల (పందల్) నిర్మాణానికి ఉద్యాన శాఖ ద్వారా రూ.1,00,000/- వరకు సబ్సిడీ అందుబాటులో ఉందని తెలిపారు. బీరకాయ, సొరకాయ, దొండకాయ, కాకరకాయ వంటి తీగజాతి కూరగాయలను శాశ్వత పందిళ్లపై సాగు చేయడం ద్వారా తక్కువ నిర్వహణ ఖర్చుతో అధిక దిగుబడులు సాధించి రైతులు స్థిరమైన ఆదాయాన్ని పొందవచ్చని వివరించారు.
కరువు పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని రైతులు జామ, ఉసిరి, సీతాఫలం, మామిడి వంటి తక్కువ నీటి అవసరమయ్యే పండ్ల తోటలను అభివృద్ధి చేసుకోవాలని సూచించారు. ఈ పంటలు వాతావరణ మార్పులను తట్టుకునే సామర్థ్యాన్ని కలిగి ఉండటంతో పాటు రైతులకు దీర్ఘకాలిక ఆదాయ వనరుగా నిలుస్తాయని పేర్కొన్నారు.నీటి వినియోగ సామర్థ్యాన్ని మరింత పెంచేందుకు ఉద్యాన శాఖ ఆధ్వర్యంలో డ్రిప్ ఇరిగేషన్ (బిందు సేద్యం) సౌకర్యాన్ని సబ్సిడీపై అందిస్తున్నట్లు తెలిపారు. డ్రిప్ ద్వారా మొక్కలకు అవసరమైన నీరు నేరుగా వేర్ల వద్దకు చేరడంతో పాటు ఫర్టిగేషన్ విధానంలో ఎరువులను కూడా సమర్థవంతంగా అందించవచ్చని, దీని వల్ల నీరు, ఎరువుల వినియోగం తగ్గి పంటల దిగుబడి మరియు నాణ్యత పెరుగుతాయని తెలిపారు. అర్హులైన రైతులు ఈ పథకాల ప్రయోజనాలను పొందాలని కోరారు.ఎల్నినో ప్రభావంతో ఏర్పడే నీటి కొరత పరిస్థితులను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు రైతులు శాస్త్రీయ సాగు పద్ధతులు, నీటి పొదుపు సాంకేతికతలు మరియు ప్రభుత్వ సబ్సిడీ పథకాలను పూర్తిస్థాయిలో వినియోగించుకొని ప్రత్యామ్నాయ ఉద్యాన పంటల సాగు ద్వారా అధిక ఆదాయాన్ని సాధించాలని తెలిపారు

# రామాలయంలో శ్రీరామాత్మవరుణ యాగం

**- ఏకాదశి సందర్భంగా భక్తులతో కిటకిటలాడిన రామాలయం**



**భద్రాచలం జూలై 25 (జనంసాక్షి)**
భద్రాచలం తొలి ఏకాదశి పర్వదినం సందర్భంగా శ్రీ సీతారామచంద్రస్వామి వారి ఆలయంలో భక్తుల రద్దీ పెరిగింది. వివిధ ప్రాంతాల నుంచి భారీగా కదిలి వచ్చిన భక్తులతో ఆలయ ప్రాంతాలన్నీ రద్దీగా మారాయి. తెల్లవారుజాము నుంచే స్వామివారి దర్శనం కోసం భక్తులు భారీ సంఖ్యలో కదిలి రావడంతో క్యూలైన్లన్నీ భక్తులతో నిండిపోయాయి. బేడ మండపంలో జరిగే నిత్య కళ్యాణ వేడుకలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఆషాడ మాసం తొలి ఏకాదశి సందర్భంగా స్వామివారి ఆలయంలో శ్రీరామాత్మక వరుణ యాగాన్ని నిర్వహిస్తున్నారు. వరుణ యాగాన్ని నిర్వహించడం ద్వారా దేశవ్యాప్తంగా వర్షాలు బాగా కురిసి పాడిపంటలు పండి దేశాభివృద్ధి జరుగుతుందని తద్వారా ప్రజలంతా సుభిక్షంగా ఉండాలని ఈ వరుణ యాగాన్ని నిర్వహిస్తున్నట్లు ఆలయ అర్చకులు తెలిపారు. వరుణ యాగంలో భాగంగా ఆలయంలో ప్రత్యేక వేదికను ఏర్పాటు చేసి స్వామి వారిని వేంచేయింపజేశారు. తొలుత విశ్వక్సేనార్చన, పుణ్యాహవనం గావించారు. అనంతరం చతుర్వేద పారాయణం, వాసుదేవ సంఘరణ, కలశాలలో ఆవాహనను ఆగమశాస్త్రం ప్రకారం వైదిక బృందం నిర్వహించారు. అనంతరం హోమ కలశాలోని జలాలతో సహస్రధారాభిషేకం నిర్వహించారు. రామచంంద్రప్రభువు దయతో అతివృష్టి కలిగి నదులన్నీ జలాలతో నిండాలని, రైతులంతా సుభిక్షంగా ఉండాలని ఆకాంక్షించారు.

# ప్రతి పౌరుడు ఒక మొక్క నాటాలి

**- అనుమతి లేకుండా చెట్లు నరికితే కఠిన చర్యలు**
**- సర్పంచ్ పూనెం కృష్ణ, అటవీ శాఖ రేంజ్ అధికారి జస్వంత్**

**భద్రాచలం జూలై 25 (జనంసాక్షి)**
ప్రతి పౌరుడు ఒక మొక్క నాటడంతో పాటు నాటిన మొక్కలను సంరక్షించే బాధ్యత స్వచ్ఛందంగా స్వీకరించాలని భద్రాచలం గ్రామ సర్పంచ్ పూనెం కృష్ణ, అటవీ రేంజి అధికారి జస్వంత్‌లు పేర్కొన్నారు. గ్రీన్ భద్రాద్రి ఆధ్వర్యంలో ఈ ఏడాది నాటేందుకు తీసుకువచ్చిన వివిధ రకాల భారీ నీడనిచ్చే మొక్కలను శనివారం గ్రీన్ భద్రాద్రి సభ్యులు, అటవీ శాఖ అధికారులు, ప్రజాప్రతినిధులు కలిసి పరిశీలించారు. మొక్కల నాణ్యత, సంరక్షణ, నాటే ప్రాంతాల ఎంపిక, నిర్వహణ, రాబోయే వృక్షారోపణ కార్యక్రమాలపై సమగ్రంగా చర్చించారు. ప్రతి పౌరుడు కనీసం ఒక్క మొక్కను నాటి, దానిని సంరక్షించే బాధ్యతను తీసుకుంటేనే భద్రాచలాన్ని పచ్చని, సుందరమైన పట్టణంగా తీర్చిదిద్దడం సాధ్యమవుతుందని పేర్కొన్నారు. పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రీన్ భద్రాద్రి అధ్యక్షులు ఆర్. రామకృష్ణ రెడ్డి, గ్రీన్ భద్రాద్రి కార్యదర్శి రంజిత్ నాయక్, కోశాధికారి ఉప్పాడ రామ్ ప్రసాద్ రెడ్డి, ఉపాధ్యక్షులు డాక్టర్ కృష్ణ ప్రసాద్, సంయుక్త కార్యదర్శి లక్ష్మీ సావిత్రి, మాజీ అధ్యక్షులు గోళ్ళ భూపతి రావు, కామిశెట్టి కృష్ణార్జున రావు, బోనాల నాగ సూర్యనారాయణ, బెల్లంకొండ రాంబాబు, ఉమాశంకర్ నాయుడు, ప్రజా సంబంధాల అధికారి సంపత్, అటవీ శాఖ అధికారులు, వార్డు సభ్యులు, వృక్ష ప్రేమికులు, గ్రీన్ భద్రాద్రి సభ్యులు పాల్గొన్నారు.

## తొలి ఏకాదశి వేళ బొడ్రాయికి ప్రత్యేక పూజలు

**వర్షాలు కురిసి పంటలు సమృద్ధిగా పండాలని రైతులు, మహిళల ప్రార్థనలు**

**అన్నపురెడ్డిపల్లి జూలై 25 ( జనం సాక్షి )**
తొలి ఏకాదశి సందర్భంగా అన్నపురెడ్డిపల్లి మండలంలోని రాజపురం గ్రామంలోని బొడ్రాయి (నాభిశిల) వద్ద రైతులు, మహిళలు భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామంలో సకాలంలో వర్షాలు కురిసి పంటలు సమృద్ధిగా పండాలని కోరుతూ మహిళలు జల బిందెలతో బొడ్రాయికి జలాభిషేకాలు చేశారు. ఈ సందర్భంగా రామాలయం అర్చకులు ముదువర్తి వెంకట నరసింహాచార్యులు, శివాలయం అర్చకులు గన్ శ్యామ్ పాండే ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.
ఈ కార్యక్రమంలో కోదుమూరి సత్యం, రామాలయం కమిటీ సభ్యులు కిశోర్, కృష్ణార్జునరావు, సుధాకర్ రెడ్డి, భక్తులు గణపతి రెడ్డి, వెంకటరెడ్డి, బోధ కృష్ణారెడ్డి, మంగతాయారు, శ్రీదేవి, సత్యవాణి, సుహాసని, దండి అప్పయ్య, రాములు, రామిశెట్టి వెంకటేశ్వరావు తదితరులు పాల్గొని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. గ్రామంలో మంచి వర్షాలు కురిసి రైతులకు సమృద్ధిగా పంటలు పండాలని భక్తులు ఆకాంక్షించారు.





## గంజాయి పట్టివేత

**- ఎక్సైజ్ శాఖ అదుపులో ఒక కారు, ఐదు సెల్ ఫోన్లతో పాటు నలుగురు నిందితులు.**

**భద్రాచలం జూలై 25 (జనంసాక్షి)**
జిల్లా ఎక్సైజ్ శాఖ అధికారులు శనివారం భారీగా గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. భద్రాచలం–కూనవరం ప్రధాన రహదారిపై నిర్వహించిన వాహన తనిఖీల్లో సుమారు క్వింటా ఒక కిలో గంజాయిని తరలిస్తున్న ముఠాను పట్టుకుని నలుగురు నిందితులను అదుపులోకి తీసుకున్నారు. భద్రాచలం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ సోమిరెడ్డి మాట్లాడుతూ భద్రాచలంలోని కూనవరం రోడ్డులో ఎక్సైజ్ ఇన్స్పెక్టర్ రహీమున్నీసా బేగం ఆధ్వర్యంలో అధికారులు వాహనాల తనిఖీలు నిర్వహించారు. ఈ క్రమంలో అనుమానాస్పదంగా వెళ్తున్న మారుతి సుజుకి ఎర్టిగా కారును ఆపి తనిఖీ చేయగా అందులో సుమారు క్వింటా ఒక కిలో (101 కిలోలు) గంజాయిని గుర్తించారు. ఈ గంజాయిని మోతుగూడెం ప్రాంతం నుంచి కర్ణాటకలోని బెంగళూరుకు అక్రమంగా తరలిస్తున్నట్లు అధికారులు గుర్తించారు. ఈ కేసులో కర్ణాటక రాష్ట్రానికి చెందిన సలీం పాషా, ఎం.డి. అరబాద్ హుస్సేన్, ఎస్. గుల్జార్తో పాటు ఆంధ్రప్రదేశ్ లోని అనంతపురం జిల్లాకు చెందిన రాజేంద్రప్రసాద్‌ను అదుపులోకి తీసుకున్నారు. నిందితుల నుంచి గంజాయితో పాటు మారుతి సుజుకి ఎర్టిగా కారు, ఐదు సెల్ ఫోన్లను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి పూర్తి స్థాయి దర్యాప్తు చేస్తున్నామని సోమిరెడ్డి తెలిపారు.

## ఐలాపురం బ్రిడ్జిపై గుంతలు పూడ్చిన సర్పంచ్

పినపాక, జూలై 25(జనం సాక్షి):
పినపాక మండలంలోని ఐలాపురం బ్రిడ్జిపై గుంతలు ఏర్పడి ప్రయాణికులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న విషయం తెలిసిందే. దీనిపై స్పందించిన భూపాలపట్నం గ్రామ సర్పంచ్ స్వప్న వెంటనే చర్యలు చేపట్టి బ్రిడ్జిపై ఉన్న గుంతలను పూడ్చించే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ ఐలాపురం బ్రిడ్జి తమ గ్రామపంచాయతీ పరిధిలో లేకపోయినా ప్రజల ప్రాణాల భద్రతే ముఖ్యమనే ఉద్దేశంతో ప్రమాదాలు జరగకుండా ముందస్తు చర్యగా గుంతలను పూడ్చించినట్లు తెలిపారు. గతంలో ఇదే ప్రాంతంలో అనేక రోడ్డు ప్రమాదాలు చోటుచేసుకున్నాయని, భవిష్యత్తులో అలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ఈ చర్యలు చేపట్టినట్లు తెలిపారు. గుంతల పూడ్చివేత కార్యక్రమానికి సహకరించిన సామాజిక కార్యకర్త నరసింహారావు, కానిస్టేబుల్ లక్ష్మయ్య, పంచాయతీ సిబ్బందికి సర్పంచ్ స్వప్న ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. బ్రిడ్జిపై ప్రయాణం ప్రస్తుతం కొంతవరకు సురక్షితంగా మారిందని వాహనదారులు హర్షం వ్యక్తం చేస్తు సర్పంచ్ స్వప్న కు ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు.

# అక్రమ మైనింగ్‌పై వెంటనే సమగ్ర విచారణ చేపట్టాలి

- **భద్రాద్రి కొత్తగూడెం కలెక్టరేట్‌ను ముట్టడిస్తాం**
- **సేవాలాల్ సేన జిల్లా అధ్యక్షులు ధారావత్ సురేష్ నాయక్**



**టేకులపల్లి, జూలై 25(జనంసాక్షి):**
జిల్లా మైనింగ్ శాఖలో కొంతమంది అధికారులు అడ్డదారులు తొక్కుతూ అవినీతి తిమింగలాలుగా మారారని, అక్రమ మైనింగ్ పై వెంటనే సమగ్ర విచారణ చేపట్టాలని, బాధ్యులైన జిల్లా మైనింగ్ శాఖ అధికారులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని సేవాలాల్ సేన జిల్లా అధ్యక్షులు ధరావత్ సురేష్ నాయక్ డిమాండ్ చేశారు. శనివారం సేవాలాల్ సేన టేకులపల్లి మండల అధ్యక్షులు బానోత్ కిషన్ నాయక్ ఆధ్వర్యంలో నిర్వహించిన ముఖ్య కార్యకర్తల సన్నాహక సమావేశంలో సేవాలాల్ సేన జిల్లా అధ్యక్షులు ధరావత్ సురేష్ నాయక్ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. తోగూడెం గ్రామ పంచాయతీ పరిధిలో కొనసాగుతున్న అక్రమ మైనింగ్ వ్యవహారంపై జిల్లా కలెక్టర్ వెంటనే సమగ్ర విచారణకు ఆదేశించాలని డిమాండ్ చేశారు. ప్రజల ఆస్తి అయిన సహజ వనరులను కొల్లగొడుతూ, ప్రభుత్వ ఖజానాకు వందల కోట్ల రూపాయల నష్టం కలిగించే విధంగా అక్రమ తవ్వకాలు కొనసాగుతు న్నా, సంబంధిత అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిం చడం తీవ్ర ఆందోళనకు గురిచేస్తోందన్నారు. మైనింగ్ శాఖ అధికారులు తోగూడెం క్వారీలను ఇప్పటికే మూడుసార్లు సీజ్ చేశామని చెప్పడం స్వయంగా అక్కడ అక్రమాలు జరిగినట్లు నిర్ధారిస్తోంద న్నారు. అయితే ప్రతి సారి కొద్ది రోజుల పాటు మాత్రమే సీజ్ చేసినట్లు చూపించి, అనంతరం తిరిగి క్వారీలను తెరిచి అక్రమ తవ్వకాలకు అవకాశం కల్పించడం వెనుక అసలు కారణం ఏమిటో ప్రజలకు సమాధా నం చెప్పాలని ప్రశ్నించారు. ఎనిమిది నెలలు, తొమ్మిది నెలల విరామాలతో చర్యలు తీసుకోవడాని కి కారణమేంటి, అక్రమాలు తెలిసినా ఎందుకు కఠిన చర్యలు తీసుకోలేదని మైనింగ్ శాఖ అధికారులను నిలదీశారు. ఎవరైనా ఫిర్యాదు చేసినప్పుడు మాత్రమే రెండు రోజులపాటు సీజ్ చేసినట్లు చూపించి, ఆ తర్వాత మళ్లీ యథావిధిగా అక్రమ మైనింగ్ కొనసాగేందుకు అవకాశం కల్పించడం వల్ల అక్రమ నిర్వాహకులు వందల కోట్ల రూపాయల లాభాలు పొందారని ఆరోపించారు. అక్కడ జరిగిన తవ్వకాల పరిమాణం భారీగా ఉన్నప్పటికీ, కొంత మేర మాత్రమే తవ్వకాలు జరిగినట్లు నమోదు చేసి ప్రభుత్వానికి రావాల్సిన రాయల్టీని తగ్గించడం ద్వారా ప్రజాధనానికి భారీ నష్టం కలిగించారని ఆరోపించారు. కొంత మేరకు మాత్రమే రాయల్టీ, పెనాల్టీలు విధించడం ద్వారా అసలు అక్రమాలను కప్పిపుచ్చే ప్రయత్నం జరుగుతోందన్నారు. అదేవిధంగా సమాచార హక్కు చట్టం ఆర్.టి.ఐ ద్వారా తోగూడెం క్వారీలకు చట్టబద్ధమైన అనుమ తులు ఉన్నాయా అని అడిగితే, అన్ని క్వారీలకు అనుమతులు ఉన్నట్లు తప్పుడు సమాచారం ఇచ్చి ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని తీవ్రంగా విమర్శించారు. ఇది కేవలం సమాచారాన్ని వక్రీకరించడం మాత్రమే కాకుండా ప్రజాస్వామ్య వ్యవస్థను అవమానించడమేనని అన్నారు. జిల్లా మైనింగ్ అధికారుల పాత్రపై స్వతంత్ర, నిష్పాక్షిక విచారణ జరిపి, అక్రమాలకు పాల్పడిన వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని, అవసరమైతే క్రిమినల్ కేసులు నమోదు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. జిల్లా కలెక్టర్ వెంటనే స్పందించి సమగ్ర విచారణకు ఆదేశించి, బాధ్యులపై చర్యలు తీసుకోకపోతే ఈ నెల 27వ తేదీన భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టరేట్ (ఎఆూఅ) వద్ద సేవాలాల్ సేన ఆధ్వర్యంలో ముట్టడి నిర్వహిస్తామని తెలిపారు. గిరిజనుల హక్కులు, ప్రకృతి సంపద పరిరక్షణ, ప్రభుత్వ ఆదాయ రక్షణ కోసం జరుగుతు న్న ఈ ప్రజాస్వామ్య పోరాటంలో గిరిజన యువత, ప్రజాసంఘాలు, పర్యావరణ పరిరక్షకులు, ప్రజాస్వామ్యవాదులు వేలాదిగా పాల్గొని విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సేవాలాల్ సేన జిల్లా ప్రధాన కార్యదర్శి లావుడియా వెంకటేష్ నాయక్, జిల్లా ఉపాధ్యక్షులు బోడ రమేష్ నాయక్, జిల్లా అధికార ప్రతినిధి బానోతు నాగరాజు నాయక్, జిల్లా ప్రచార కార్యదర్శి జరుపల లాలూ నాయక్, బోడ బాలు నాయక్, ధరావత్ కోక్యా నాయక్, దరావత్ బాలు నాయక్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రతి ఇంటా.. ఇంకుడు గుంత..









## ○ఇంకుడు గుంతలు నిర్మించకపోతే, భవిష్యత్తులో తీవ్ర నీటి సంక్షోభం..
## ○ప్రతి ఒక్కరూ చెట్లు నాటాలి వాటిని సంరక్షించాలి..
## ○నీతి వృధాను అరికట్టి ఇంకుడు గుంత నిర్మించాలి..

**మణుగూరు, జూలై 25 (జనంసాక్షి):**
ఇంకుడు గుంతలు నిర్మించకపోతే, భవిష్యత్తులో మనం తీవ్రమైన నీటి సంక్షోభాన్ని పర్యావరణ సమస్యలను ఎదుర్కోవాల్సి వస్తుందని మణుగూరు మున్సిపల్ కమిషనర్ టి ప్రసాద్ రావు అన్నారు. శనివారం మున్సిపాలిటీ పరిధిలో ప్రజలకు ఇంకుడు గుంతలు ఏర్పాటు పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... ప్రతి సంవత్సరం జనాభా తో పాటు నీటి వాడకం పెరుగుతోంది. దాంతో పాటు అడవులు అంతరించి పోతున్నాయి. ఎండ వేడి పెరిగి వర్షాలు ఆలస్యంగా కురుస్తున్నాయి. తద్వారా భవిష్యత్తులో నీటి, ఆహార సమస్య తలెత్తి కరువు కాటకాలు వచ్చే అవకాశం ఉంది

**వర్షపు నీటిని నిల్వ చేయాలి:**
వర్షపు నీటిని నిల్వ చేయడానికి అత్యంత సులభమైన ఉత్తమమైన మార్గం "రూఫ్ టాప్ రెయిన్ వాటర్ హార్వెస్టింగ్" (ఇంటి పైకప్పు ద్వారా నీటి సేకరణ). వాన నీటిని వృథా చేయకుండా నేరుగా వాడుకోవడానికి లేదా భూమిలోకి పంపడానికి ప్రధానంగా రెండు పద్ధతులు ఉన్నాయి. ప్రత్యక్ష నిల్వ పద్ధతి ద్వారా నీటిని ట్యాంకుల్లో దాచుకుని వాడుకోవడం. రెండవ పద్ధతి భూగర్భ జలాల రీఛార్జ్ పద్ధతి ఇంటి పైన పడే వాన నీటిని సేకరించేందుకు వీలుగా పైకప్పును శుభ్రంగా ఉంచుకోవాలి. పైకప్పు చుట్టూ ఉన్న నీరంతా ఒకే చోటికి వచ్చేలా పైపులు ఏర్పాటు చేయాలి. ఆ నీటిని ఇంకుడు గుంతలకు మళ్లించాలి.
ఇంకుడు గుంత వల్ల భూగర్భ జల మట్టాన్ని పెంచడం నీటి కొరతను నివారించడం. వర్షపు నీరు వృథాగా పోకుండా భూమిలోకి ఇంకేలా చేయడం ద్వారా భవిష్యత్తు తరాలకు జల సంరక్షణ లభిస్తుంది. వర్షపు నీటిని నేరుగా భూమిలోకి పంపించడం వల్ల భూగర్భ జల మట్టం వేగంగా పెరుగుతుంది. ఎండిపోయిన బోరు బావులు, చేతి పంపులు మళ్లీ పనిచేస్తాయి. వేసవి కాలంలో వచ్చే తీవ్రమైన నీటి ఎద్దడి సమస్య తగ్గుతుంది. భూమిలో తగినంత తేమ శాతం పెరిగి పర్యావరణం మెరుగుపడుతుంది.

**నీటి వృథాను అరికట్టాలి:**
ఇంట్లో నీరు, బయట చేతి పంపు,బోరు బావిలో నీరు వృథాగా చేయకుండా అవసరమున్నంత వరకే వాడాలి.
వర్షపు నీరు భూమిలోకి ఇంకే దారి లేక రోడ్లపైకి వస్తుంది. దీనివల్ల డ్రైనేజీలు పొంగిపొర్లి, నగరాలు ముంపునకు గురవుతాయి. పట్టణాల్లో పైప్ లైన్ ద్వారా నీటిని వృథా చేస్తున్నారు.
భూమిలో తేమ శాతం తగ్గిపోవడం వల్ల చెట్లు, మొక్కలు ఎండిపోయి ఉష్ణోగ్రతలు (ఎండలు) విపరీతంగా పెరుగుతాయి.
భూమిలో నీటి మట్టం బాగా తగ్గిపోయినప్పుడు, అందులో ఫ్లోరైడ్ ఇతర రసాయనాల శాతం పెరిగి ఆ నీరు తాగడానికి పనికిరాకుండా పోతుంది.
మీరు మీ ప్రాంతంలో లేదా ఇంటి వద్ద ఇంకుడు గుంతను నిర్మించడానికి ప్రతి ఒక్కరూ ముందుకు రావాలి భవిష్యత్తు తరాలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది

**ఇంకుడు గుంతలు ఏర్పాటు:**
ప్రతి ఇంటిలో గ్రామాల్లో పట్టణాల్లో ఇంకుడు గుంత ఏర్పాటు చేయడం వల్ల వృధా నీరును నిల్వ చేయవచ్చు పంట పొలాలలో వర్షపు నీటిని నిల్వచేసి తద్వారా దానిని ఉపయోగించుకోవచ్చు. ప్రతి ఒక్కరూ తమ ఇంటి ఆవరణలో మొక్కలు పెంచాలి. ప్రభుత్వ కార్యాలయాలు, ప్రైవేట్ సంస్థలలో విద్యాసంస్థలలో రహదారి కి ఇదువైపులా చెట్లు పెంచడం వల్ల కొంతవరకు సమస్యను తగ్గించవచ్చు. కేవలం మొక్కలు నాటడం కాదు వాటిని సంరక్షించడం కూడా మన బాధ్యతే ఇప్పుడు నిర్లక్ష్యం చేస్తే భవిష్యత్తులో తాగటానికి నీరు తినటానికి తిండి ఉండటానికి నీడ లేక అనేక ఇబ్బందుల తో పాటు అనారోగ్య సమస్యలు వస్తాయని నిపుణులు చెబుతున్నారు.

# కాలునొప్పి చికిత్సలో సర్పంచ్ మృతి.. భద్రాచలంలో ఉద్రిక్తత..

**- వైద్యుల నిర్లక్ష్యమే కారణమని బంధువుల ఆరోపణ.- ఆసుపత్రి ఎదుట మృతదేహంతో ధర్నా.. - కౌంటర్‌కు నిప్పంటించిన ఆందోళనకారులు..**



**భద్రాచలం జూలై 25 (జనంసాక్షి)**
పాల్వంచ మండలం దంతెలబోరు గ్రామ సర్పంచ్ వెంకటరమణ (36) భద్రాచలంలోని అంబేద్కర్ సెంటర్‌లో ఉన్న ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందడంతో శనివారం తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. వైద్యుల నిర్లక్ష్యం వల్లే ఆమె మృతి చెందిందని ఆరోపిస్తూ కుటుంబ సభ్యులు, గ్రామస్తులు, సీపీఐ నాయకులు, కార్యకర్తలు ఆసుపత్రి ఎదుట మృతదేహంతో ధర్నా నిర్వహించారు.
కుటుంబ సభ్యుల కథనం ప్రకారం, కాలుప్పి సమస్యతో వెంకటరమణను బుధవారం ప్రైవేట్ ఆసుపత్రిలో చేర్పించారు. చికిత్స అనంతరం ఆరోగ్య పరిస్థితి విషమించడంతో ఆసుపత్రి యాజమాన్యమే ప్రత్యేక అంబులెన్స్‌లో ఖమ్మం తరలిస్తుండగా మార్గమధ్యంలో ఆమె మృతి చెందినట్లు తెలిపారు. అనంతరం మృతదేహాన్ని భద్రాచలంలోని అదే ఆసుపత్రి వద్దకు తీసుకొచ్చి శు క్రవారం అర్ధరాత్రి నుంచి ఆందోళన చేపట్టారు. శనివారం ఉదయం దంతెలబోరు గ్రామం నుంచి పెద్ద సంఖ్యలో గ్రామస్తులు, సీపీఐ నాయకులు, కార్యకర్తలు తరలిరావడంతో ఆసుపత్రి వద్ద ఉద్రిక్తత నెలకొంది. వైద్యుల నిర్లక్ష్యం, సరైన చికిత్స అందించకపోవడం వల్లే ఆరోగ్యంగా ఉన్న తన భార్య మృతి చెందిందని మృతురాలి భర్త ఆరోపించారు. అత్యవసర పరిస్థితిలో బంధువులను లోపలికి అనుమతించకుండా ఆసుపత్రి సిబ్బంది తమ ఇష్టానుసారంగా చికిత్స చేశారని విమర్శించారు. బాధ్యులైన వైద్యులు, సిబ్బందిపై కఠిన చర్యలు తీసుకుని ఆసుపత్రిని సీజ్ చేయాలని డిమాండ్ చేశారు. ఆందోళన ఉధృతమవడంతో కొందరు నిరసనకారులు ఆసుపత్రిలోకి చొరబడి క్యాష్ కౌంటర్ వద్ద ఉన్న సామగ్రిపై పెట్రోలు పోసి నిప్పంటించారు. పోలీసులు అడ్డుకునే ప్రయత్నం చేసినప్పటికీ వారిని తోసుకుంటూ లోపలికి వెళ్లిన ఘటన చోటుచేసుకుంది. దీంతో భారీ పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. ఈ ఘటన నేపథ్యంలో ఆసుపత్రి యాజమాన్యం మధ్యవర్తుల ద్వారా రాజీ ప్రయత్నాలు చేసినట్లు సమాచారం. మరోవైపు వెంకటరమణ మృతిపై నిష్పక్షపాతంగా విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని భద్రాచలం మాజీ ఎమ్మెల్యే, అటవీశాఖ అభివృద్ధి సంస్థ చైర్మన్ పొదెం వీరయ్య డిమాండ్ చేశారు. గమనిక: వైద్యుల నిర్లక్ష్యంపై కుటుంబ సభ్యులు ఆరోపణలు చేశారు. ఈ ఆరోపణలపై అధికారిక విచారణ కొనసాగుతోంది. ఆసుపత్రి యాజమాన్యం స్పందన వెలువడాల్సి ఉంది.



# కాంగ్రెస్ ఎస్సీ సెల్ ప్రమాణ స్వీకార కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి: దేపంగి వెంకటరమణ

**అశ్వాపురం, జూలై 25 జనంసాక్షి:**
కొత్తగూడెం క్లబ్‌లో ఆదివారం జరగనున్న కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ జిల్లా కమిటీ, మండల కమిటీ సభ్యుల ప్రమాణ స్వీకార కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ జిల్లా జనరల్ సెక్రటరీ దేపంగి వెంకటరమణ పిలుపునిచ్చారు. అశ్వాపురం మండలం మల్లెలమడుగు గ్రామంలో ఆయన మాట్లాడుతూ, ఎస్సీ సెల్ జిల్లా చైర్మన్ గద్దల రమేష్ ఆధ్వర్యంలో నిర్వహించే ఈ కార్యక్రమానికి జిల్లా, మండల స్థాయి ఎస్సీ సెల్ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎస్సీ సెల్ రాష్ట్ర చైర్మన్, ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ హాజరుకానున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో ఎస్సీ సెల్ నాయకులు నందిపాటి ప్రశాంత్, గొడ్ల సురేష్, కొప్పుల నరసింహారావు, మచ్చ నాగేశ్వరరావు, నందిపాటి వెంకన్న, ఇస్సంపల్లి లక్ష్మణ్, నంద్రు వెంకటి తదితరులు పాల్గొన్నారు.

# మిర్యాలగూడ పట్టణ, మండల కాంగ్రెస్ అధ్యక్షుల నియామకం
## మిర్యాలగూడ మండల అధ్యక్షులు గా గుండు నరేందర్











**జనంసాక్షి, మిర్యాలగూడ :**
మిర్యాలగూడ నియోజకవర్గం లో పట్టణ, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులను నియమిస్తూ టీ పీసీసీ అధ్యక్షులు మహేశ కుమార్ గౌడ్ శనివారం ఉత్తర్వులు జారిచేశారు.
మిర్యాలగూడ మండల అధ్యక్షులు గా గుండు నరేం దర్ గౌడ్, మిర్యాలగూడ పట్టణ 1 టౌన్ అధ్యక్షులు గా కోడిరెక్క ఇంద్రకుమార్,2 టౌన్ అధ్యక్షులు గా మొహ్మద్ మొయిజ్, వేములపల్లి మండల అధ్యక్షులు గా రెగట్టి రవీందర్ రెడ్డి, దామరచర్ల మండల అధ్యక్షులు గా కొర్ర నాగు నాయక్ లని నియమించారు.

# రాష్ట్ర దివ్యాంగ ఉద్యోగుల ఆత్మీయ సమావేశాన్ని విజయవంతం చేయండి

**దివ్యాంగ ఉద్యోగుల జిల్లా ప్రధాన కార్యదర్శి బానోతు లక్ష్మ**



**టేకులపల్లి, జూలై 25 (జనంసాక్షి):**
ఈనెల 26న ( నేడు) ప్రకాశం హాల్, నాంపల్లి, హైదరాబాద్‌లో నిర్వహించనున్న తెలంగాణ రాష్ట్ర దివ్యాంగ ఉద్యోగుల రాష్ట్ర స్థాయి ఆత్మీయ సమావేశాన్ని విజయవంతం చేయాలని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా దివ్యాంగ ఉద్యోగులు ప్రధాన కార్యదర్శి బాణోతు లక్ష్మ పిలుపునిచ్చారు. రాష్ట్ర అధ్యక్షులు షేక్ హబిబ్ మియా,ప్రధాన కార్యదర్శి లక్ష్మయ్య, భద్రాద్రి జిల్లా అధ్యక్షులు జగ్గుద్ధశ్ పిలుపు మేరకు ఈ సమావేశం నిర్వహించబడుతుందని తెలిపారు. దివ్యాంగ ఉద్యోగుల సమస్యల పరిష్కారం, జీవో-34 అమలు, ఈ హెచ్ ఎస్ కోత రద్దు,అదనపు 5 సిఎల్ లు, ఎన్నికల విధుల నుండి మినహాయింపు, ఇతర న్యాయమైన డిమాండ్ల సాధన కోసం ఈ సమావేశం అత్యంత కీలకమని తెలిపారు. తెలంగాణ దివ్యాంగ ఉద్యోగుల సంక్షేమ సంఘం (ఆంఇచిం) ఆధ్వర్యం లో జూలై 26 (ఆదివారం) ఉదయం 10:30 గంటలకు హైదరాబాద్‌లోని ప్రకాశం హాల్‌లో నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి దివ్యాంగ ఉద్యోగుల ఆత్మీయ సమావేశానికి భద్రాద్రి కొత్తగూడెం జిల్లా నుండి అధిక సంఖ్యలో దివ్యాంగ ఉద్యోగులు హాజరుకావాలని జిల్లా ప్రధాన కార్యదర్శి బాణోతు లక్ష్మ ఒక ప్రకటనలో కోరారు. దివ్యాంగ ఉద్యోగుల హక్కుల పరిరక్షణ, సంక్షేమం, పదోన్నతులు, బదిలీలు, సేవా సౌకర్యాల మెరుగుదలతో పాటు పెండింగ్‌లో ఉన్న న్యాయమైన డిమాండ్ల సాధన కోసం ఈ సమావేశం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రతి ఉద్యోగి ఐక్యంగా పాల్గొని ఉద్యమాన్ని బలో పేతం చేయాలని విజ్ఞప్తి చేశారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా నుండి సమావేశానికి బయలుదేరే ఉద్యోగులు తమ మండలాల బాధ్యులతో సంప్రదించి సమయానికి చేరుకోవాలని, ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు.

## సర్ ప్రక్రియను వందశాతం పూర్తి చేయాలి

### ఎమ్మెల్యే బాలు నాయక్



**చింతపల్లి, జులై 25 (జనంసాక్షి)**

ఓటు హక్కు ప్రతి పౌరుడికి రాజ్యాంగం కల్పించిన అత్యంత విలువైన హక్కు అని దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్ అన్నారు. ఓటరు జాబితా ప్రత్యేక సవరణ సర్ ప్రక్రియను విజయవంతం చేయాలనే లక్ష్యంతో చింతపల్లి మండలం తీదేడు గ్రామంలో ఆయన విస్తృత పర్యటన నిర్వహించారు. ఈ సందర్భంగా బీఎల్ఏలు బీఎల్ఓలు కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలతో సమావేశమై సర్ ప్రక్రియపై సమగ్ర అవగాహన కల్పించారు. అర్హత కలిగిన ఒక్క ఓటరి పేరు కూడా ఓటరు జాబితా నుంచి తొలగిపోకుండా ప్రతి ఇంటికి వెళ్లి వివరాలను పరిశీలించాలని, అవసరమైన పత్రాలను సకాలంలో సమర్పించేలా ప్రజలను చైతన్యపరచాలని సూచించారు. ప్రతి బూత్‌లో ప్రత్యేక శ్రద్ధతో పనిచేసి ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా ఓటరు జాబితా సవరణ చేపట్టాలని, ప్రజలు కూడా తమ ఓటరు వివరాలను స్వయంగా పరిశీలించి అవసరమైన మార్పులు, చేర్పులు చేసుకోవాలని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు. ప్రజాస్వామ్య పరిరక్షణలో ప్రతి కార్యకర్త బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, ప్రతి బూత్‌లో వంద శాతం సర్ ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని బీఎల్ఏలు, బీఎల్ఓలు, కాంగ్రెస్ పార్టీ నాయకులకు ఎమ్మెల్యే బాలు నాయక్ సూచించారు. ఈ కార్యక్రమంలో చింతపల్లి తహశీల్దార్ విజయలక్ష్మి, ఆర్ఐ సునీత, సర్పంచ్ ఉలుపాల స్వప్న శేఖర్ రెడ్డి, కమిటీ డైరెక్టర్లు, స్థానిక ప్రజాప్రతినిధులు, మాజీ సర్పంచులు, కాంగ్రెస్ పార్టీ మండల, బ్లాక్ నాయకులు, బీఎల్ఓలు, బీఎల్ఏలు, కార్యకర్తలు, గ్రామ పెద్దలు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు..

## నిర్దేశిత గడువులోగా ఎస్ఐఆర్ పూర్తి చేయాలి



**సూర్యాపేట (జనంసాక్షి):**

సూర్యాపేట పట్టణంలోని 32వ వార్డులో స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ప్రక్రియను క్షేత్రస్థాయిలో ఏఐసీసీ సభ్యులు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి, మున్సిపల్ చైర్ పర్సన్ మొరిశెట్టి నివేదిత లక్షాది, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ కుమ్మరికుంట్ల వేణుగోపాల్ శనివారం పరిశీలించారు. వార్డులో నేరుగా పర్యటించి, ఓటర్ల నమోదు, ఫారాల సేకరణ తీరును పరిశీలించారు. ఈ సందర్భంగా ఏఐసీసీ సభ్యులు రాం రెడ్డి సర్వోత్తమ్ రెడ్డి మాట్లాడుతూ నిర్దేశిత గడువులోగా ఎస్ఐఆర్ ప్రక్రియను పూర్తిచేయా లని, అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు అయ్యేలా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. అర్హులైన ఓటరు జాబితా నుంచి మిగిలిపోకుండా, ఇంటింటికీ వెళ్లి పూర్తి స్థాయిలో ధృవీకరణ చేపట్టాలని అన్నారు. ఈ కార్యక్రమంలో 32వ వార్డు కౌన్సిలర్ కుంభం రాజేందర్, జిల్లా కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ అబ్దుల్ రహీం, చివ్వెంల మండల పార్టీ అధ్యక్షుడు ధారవత్ వీరన్న నాయక్, మున్సిపల్ కౌన్సిలర్లు కొండపల్లి దిలీప్ రెడ్డి, షేక్ జహీర్, జిల్లా కాంగ్రెస్ నాయకులు నాగేల్లి అరుణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## మధిరను రాష్ట్రానికే ఆదర్శవంతమైన క్లీన్ అండ్ గ్రీన్ పట్టణంగా తీర్చిదిద్దుతాం

### చైర్‌పర్సన్ సామినేని సుజాత

**మధిర,జూలై 25 (జనంసాక్షి):**

మధిర పట్టణాన్ని పరిశుభ్రతకు మారుపేరుగా,రాష్ట్రంలోనే నెంబర్ వన్ మున్సిపాలిటీగా తీర్చిదిద్దడమే ధ్యేయంగా యంత్రాంగం అడుగులు వేస్తోంది. రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క గారి ప్రత్యేక చొరవతో మధిర అభివృద్ధి కోసం కోట్లాది రూపాయల నిధులు వెల్లువెత్తుతుండటంతో,పట్టణంలో ప్రస్తుతం అభివృద్ధి కార్యక్రమాలు ముమ్మరంగా సాగుతున్నాయి. డిప్యూటీ సీఎం సంకల్పానికి ప్రజలందరూ భాగస్వాములు కావాలని, మన మధిరను మనమే క్లీన్‌గా ఉంచుకోవాలని మున్సిపల్ చైర్‌పర్సన్ సామినేని సుజాత పిలుపునిచ్చారు. ఈ అభివృద్ధి బాటలో భాగంగానే పురపాలక సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం మన మధిర - మన బాధ్యత పేరుతో అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 90 రోజుల శానిటైజింగ్ యాక్షన్ ప్లాన్ అమలును ముమ్మరం చేశారు. ఇందులో తొలి దశలో భాగంగా పైలట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసిన నాలుగో వార్డులో మున్సిపల్ చైర్‌పర్సన్ సామినేని సుజాత స్వయంగా క్షేత్రస్థాయిలో పర్యటించి స్థానికుల్లో నూతన చైతన్యం నింపారు. వార్డులో గడపగడపకూ తిరిగిన ఆమె.. తడి చెత్త, పొడి చెత్తను వేరుచేయడం వల్ల కలిగే లాభాలను ప్రజలకు పూసగుచ్చినట్లు వివరించారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ సుజాత మాట్లాడుతూ,చెత్తను ఎక్కడపడితే అక్కడ పారవేయకుండా మన మున్సిపాలిటీ పారిశు ధ్య సిబ్బందికి అందించాలి. ప్రతి పౌరుడు తన ఇంటి పరిసరాలను కంటికి రెప్పలా శు భ్రంగా ఉంచుకుంటేనే మన పట్టణ సుందరీకరణ సాధ్యమవుతుంది. ఇది మనందరి సామాజిక బాధ్యత అని స్పష్టం చేశారు. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క సహకారంతో జరుగుతున్న కోట్లాది రూపాయల అభివృద్ధి పనులతో పాటు,ప్రజల భాగస్వామ్యంతో మధిరను రాష్ట్రానికే ఆదర్శవంతమైన క్లీన్ అండ్ గ్రీన్





పట్టణంగా తీర్చిదిద్ది తీరుతామని ఆమె ఈ సందర్భంగా ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ సామ్యూల్ బెనిటిక్ ఇస్రాయిల్ పాల్, ఇన్విoత్ర ప్రైవేటు లిమిటెడ్ సీఈవో సుద్దాల ఉదయ్ చంద్ర, 13 వార్డ్ కౌన్సిలర్ షేక్ రసీద్దీన్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, గ్రామ ప్రజలు,మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

## వార్డుల్లో నెలకొన్న సమస్యల పరిష్కారానికి కృషి



**సూర్యాపేట (జనంసాక్షి):**

సూర్యాపేట జిల్లా కేంద్రంలోని 32వ వార్డులో శనివారం నూతన సిసి రోడ్డు నిర్మాణానికి ఏఐసిసి సభ్యులు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి, మున్సిపల్ చైర్ పర్సన్ మొరిశెట్టి నివేదిత లక్షాది శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మున్సిపాలిటీలోని ప్రతి వార్డులో సమస్యలను పరిష్కరించి, అభివృద్ధి కార్యక్రమాలను నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఫ్లోర్ లీడర్ కుమ్మరికుంట్ల వేణుగోపాల్,32వ వార్డు కౌన్సిలర్ కుంభం రాజేందర్, జిల్లా కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ అబ్దుల్ రహీమ్, చివ్వెంల మండల పార్టీ అధ్యక్షులు ధారవత్ వీరన్న నాయక్, మున్సిపల్ కౌన్సిలర్లు కొండపల్లి దిలీప్ రెడ్డి, షేక్ జహీర్, జిల్లా కాంగ్రెస్ నాయకులు నాగేల్లి అరుణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.




## చట్టం ఎవరికి చుట్టం కాదు

**హుజూర్ నగర్, జూలై 25 (జనంసాక్షి) :**

నేరానికి పాల్పడిన వారు ఎంతటి వారైనా చట్ట ప్రకారం శిక్షార్హులేనని చట్టం ఎవరికి చుట్టము కాదని ప్రధాన జూనియర్ సివిల్ జడ్జి కాసరగడ్డ దీప అన్నారు. శనివారం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జరిగిన న్యాయ విజ్ఞాన సదస్సులో ఆమె విద్యార్థులను ఉద్దేశించి ఆమె మాట్లాడుతూ ఒక చట్టాన్ని రూపొందించినప్పుడు అందులో పౌరుల హక్కులు విధుల గురించి పేర్కొనబడుతుందని ఆ చట్టంలో ఉండే అన్ని విషయాలు పౌరులకు తెలిసినట్లుగానే భావించాలని కూడా చట్టంలో పొందుపరచబడి ఉంటుందని అందువల్ల ఇది నేరం అని తెలియక తాము తప్పు చేశాము అంటే చట్టం మౌనంగా ఉండజాలదన్నారు. విద్యార్థినీ, విద్యార్థులు డ్రగ్స్ వినియోగానికి డ్రగ్స్ ను కలిగి ఉండటానికి దూరంగా ఉండాలని అలాగే సాంకేతికతను సన్మార్గానికి వినియోగించాలి తప్ప చట్ట వ్యతిరేక కార్యక్రమాలకు వినియోగించినట్లయితే శిక్షించబడతారన్నారు. మైనర్ బాలికలపై లైంగిక వేధింపులకు పాల్పడితే యావజ్జీవ కారాగార శిక్ష, మరణ శిక్ష సైతం విధించే అవకాశం ఉన్న పోక్సో, నిర్భయ లాంటి కఠిన చట్టాలు అమలులో ఉన్నాయని అందువల్ల విద్యార్థులు నేర ప్రవృత్తికి దూరంగా ఉండాలని ఆమె సూచించారు. ఒక లక్ష్యాన్ని ఎంచుకొని దాన్ని చేరుకోవడానికి కష్టపడి చదివి లక్ష్యాన్ని సాధించాలని విద్యార్థులకు సూచించారు. యువత మత్తుకు బానిసైతే జీవితం చిత్తవుతుందని ఆమె విద్యార్థులను హెచ్చరించారు. కళాశాలలలో, విద్యా సంస్థలలో ర్యాగింగ్ కు పాల్పడిన వారికి 3 సంవత్సరముల జైలు శిక్షతోపాటు జరిమానా కూడా విధించే అవకాశం ఉందని అందువల్ల ఏ ఒక్కరు ర్యాగింగ్ కు పాల్పడ వద్దని విద్యార్థులకు సూచించారు. కాగా తమ కళాశాల డ్రగ్స్ రహిత కళాశాల అంటూ రూపొందించిన పోస్టర్ ను న్యాయమూర్తి చేత ఆవిష్కరింపజేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ సోమపంగు రామారావు, బార్ అసోసియేషన్ కార్యదర్శి ఆర్ వి రమణారెడ్డి, న్యాయవాదులు కాల్వ శ్రీనివాసరావు, నాగేష్ రాథోడ్, కుక్కడపు సైదులు, సైదా హుస్సేన్, ఉదారి యాదగిరి, శంకర్ నాయక్, శివకృష్ణ యాదవ్, గోపీనాథ్, మహిళా న్యాయవాదులు తెప్పని శ్రీలక్ష్మి, జుట్టుకొండ సంధ్య, స్థానిక ఎస్సై హనుమా నాయక్, న్యాయశాఖ సిబ్బంది అనిత, సుశీల, పారా లీగల్ వాలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ నిర్లక్ష్యం-కాంట్రాక్టర్ల అలసత్వం-అధికారుల మౌనం

### మధిర సెంట్రల్ డ్రైనేజీ పనులపై సీపీఎం తీవ్ర ఆగ్రహం

**మధిర, జూలై 25 (జనంసాక్షి):**

మధిర మున్సిపాలిటీ పరిధిలో చేపట్టిన సెంట్రల్ డ్రైనేజీ పనులు తీవ్ర జాప్యంతో సాగుతూ ప్రజలను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నాయని సీపీఎం పార్టీ సీనియర్ నాయకులు శీలం నరసింహారావు, పట్టణ కార్యదర్శి పడకండి మురళి ఆరోపించారు. శనివారం మొదటిగా డిప్యూటీ సీఎం గెస్ట్ హౌస్ నుండి ఆత్కూరు వెళ్లి బైపాస్ రోడ్డు సెంట్రల్ డ్రైనేజీ పనులను పరిశీలించిన అనంతరం వారు ప్రభుత్వంపై, కాంట్రాక్టర్లపై, అధికారుల పనితీరుపై తీవ్ర విమర్శలు గుప్పించారు. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఆధ్వర్యంలో మధిర అభివృద్ధి పేరుతో ప్రారంభించిన సెంట్రల్ డ్రైనేజీ పనులు గత సంవత్సరన్నరగా నత్తనడకన సాగుతున్నాయని, తవ్విన రోడ్లను సకాలంలో పూడ్చకపోవడంతో ప్రజలు నిత్యం ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. గతంలో నిర్మించిన బలమైన రహదారులను తవ్వి ధ్వంసం చేసినప్పటికీ, ఇప్పటివరకు ఒక్క ప్రాంతంలో కూడా పనులు పూర్తికాలేదని విమర్శించారు. అధికారులు ఇచ్చిన హామీలు కాగితాలకే పరిమితమయ్యాయని ఆరోపించారు. నాణ్యతను పూర్తిగా విస్మరించి పనులు కొనసాగుతున్నాయని, కాంట్రాక్టర్ల నిర్లక్ష్యాన్ని అధికారులు పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. రాజకీయ ఒత్తిళ్లకు లోనుకాకుండా అధికారులు నిబంధనల ప్రకారం నాణ్యమైన పనులు పూర్తి చేయాలని, లేకపోతే భవిష్యత్తులో జరిగే నష్టాలకు వారే బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరించారు. మధిర అభివృద్ధి కోసం వేల కోట్ల రూపాయల నిధులు వస్తున్నాయని ప్రభుత్వం చెబుతున్నప్పటికీ, వాటి ఫలితాలు ప్రజలకు కనిపించడం లేదని, రోడ్లు, తాగునీటి సదుపాయాలు, ఇతర మౌలిక వసతుల అభివృద్ధిలో ఆశించిన పురోగతి లేదని విమర్శించారు. సెంట్రల్ డ్రైనేజీ పనులను నాణ్యతతో, నిర్ణీత గడువులో పూర్తి చేయాలని, లేనిపక్షంలో ప్రజలను సమీకరించి సీపీఎం ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని వారు హెచ్చరించారు.





# ప్రజలే తమ బలగం-ప్రజాసేవే తమ లక్ష్యం

## మాజీ ఎంపీటీసీ కొండపల్లి వాసు

### ప్రజల త్రాగునీటి అవసరాల కోసం సొంత నిధులతో రెండు బోర్లు ఏర్పాటు



**కల్లూరు జూలై 25(జనం సాక్షి)**
కల్లూరు మండల పరిధిలోని పేరువంచ గ్రామానికి చెందిన మాజీ ఎంపీటీసీ సభ్యులు కొండపల్లి శ్రీనివాసరావు (వాసు) తన పుట్టినరోజు సందర్భాన్ని పురస్కరించుకొని ప్రజల సంక్షేమం కోసం ముగ్గు వెంకటాపురంగ్రామపంచాయతీలో సుమారు లక్ష రూపాయల సొంత నిధులతో రెండు మంచినీటి బోర్లను శనివారంఏర్పాటు చేశారు. ముగ్గు వెంకటాపురం లో ముత్యాలమ్మ తల్లి గుడి వద్ద ఒక బోరు, మెయిన్ రోడ్డు వద్ద గల రామాలయం లో ఒక హ్యాండ్ బోరు సొంత నిధులతో డ్రిల్లింగ్ చేయించడం జరిగింది. గ్రామ ప్రజల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకొని తన పుట్టినరోజు సందర్భంగా ప్రజలకు సేవ చేయాలనే సంకల్పంతో రెండు బోర్లను తన సొంత నిధులతో వేయించినట్లు మాజీ ఎంపీటీసీ సభ్యులు కొండపల్లి వాసు తెలిపారు. ప్రజలే తమ బలగం ప్రజాసేవ తమ లక్ష్యం అని పేర్కొన్నారు.తమ కుటుంబం ప్రజల సంక్షేమం కోసమే కృషి చేస్తుందని ప్రజలు ఎటువంటి ఇబ్బందుల్లో ఉన్న వారిని ఆదుకోవడం వారి సమస్యలు పరిష్కరించటమె ధ్యేయంగా ఎన్ని ఆటంకాలు ఎదురైన వాటిని అధిగమిస్తూ వారసత్వంగా తన సోదరుడు కొండపల్లి రాధాకృష్ణ , తాను సమిష్టిగాకలిసి తమ మాతృమూర్తి కొండపల్లి ఇందిరా ఆశీస్సులతో రాజకీయాలు కొనసాగించుకుంటూ వస్తున్నామని తెలిపారు. పేరువంచ ,ముగ్గు వెంకటాపురం గ్రామాలకు చెందిన ప్రజలకు అండగా ఉంటూ, తమను నమ్ముకున్న వారికి అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాల్లో తమ వంతు సహకారాన్ని అందిస్తూ సేవ చేయటమే తమ లక్ష్యమని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ప్రజల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకొని త్రాగునీటి సౌకర్యం కోసం బోర్లు ఏర్పాటు చేసిన మాజీ ఎంపీటీసీ కొండపల్లి శ్రీనివాసరావు ( వాసు)కు, గ్రామ ప్రజలు కొండపల్లి అభిమానులు కృతజ్ఞతలు తెలియజేశారు. కొండపల్లి కుటుంబం సంపూర్ణ ఆయురారోగ్యాలతో పదికాలాలపాటు వర్ధిల్లాలని ఆకాంక్షించారు. ఈకార్యక్రమం లో ముగ్గు వెంకటాపురం సర్పంచ్ వడ్లమూడిబేబీ స్వరాజ్యలక్ష్మి సీనియర్ నాయకులు కొండపల్లి రాధాకృష్ణ గ్రామ పెద్దలు, కొండపల్లి అభిమానులు పాల్గొన్నారు.

# ప్రజా వ్యతిరేక ప్రభుత్వాలకు గుణపాఠం తప్పదు

## మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్



**ఖమ్మం కార్పొరేషన్, జూలై 25 (జనం సాక్షి )**
ప్రజావ్యతిరేక విధానాలతో పాలన సాగిస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు విద్యార్థుల పోరాటం, సాధించిన విజయం చెంపపెట్టు వంటిదని మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ పేర్కొన్నారు. ఈ పోరాటం కేవలం ఒక సమస్య పరిష్కారానికి మాత్రమే పరిమితం కాకుండా దేశంలో మార్పును కోరుకునే యువత సంకల్పానికి ప్రతీకగా నిలిచిందని అన్నారు. విద్యార్థులు, యువత ఆశయాలను విస్మరిస్తూ పాలన సాగిస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు ఈ ఉద్యమం తీవ్రమైన హెచ్చరికగా నిలిచిందని పేర్కొన్నారు. ప్రజాస్వామ్యంలో ప్రజల అభీష్టానికి విరుద్ధంగా వ్యవహరించే ప్రభుత్వాలను ప్రజలు సహించరని వారికి గుణపాఠం చెబుతారనే విషయాన్ని ఈ విజయం మరోసారి స్పష్టం చేసిందని అన్నారు. ఇకపై విద్యార్థులు, యువత సమస్యలపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సానుకూల దృక్పథంతో స్పందించి, ప్రజా సంక్షేమం, విద్యా అభివృద్ధి, ఉద్యోగ అవకాశాల కల్పనకు ప్రాధాన్యత ఇవ్వాలని మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ డిమాండ్ చేశారు.

# బీఎల్‌వోల పనితీరును పరిశీలించిన కాంగ్రెస్ నాయకులు..

**- 100 శాతం లక్ష్యం పూర్తి చేసిన బీఎల్‌వోలకు సన్మానం..**



**బూర్గంపహాడ్ జూలై 25 (జనంసాక్షి)**
టీపీసీసీ ఆదేశాల మేరకు బూర్గంపహాడ్ మండలంలో కొనసాగుతున్న ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (ఎస్ ఐ ఆర్) ప్రక్రియను పినపాక నియోజకవర్గ అసెంబ్లీ కాంగ్రెస్ పార్టీ ఎస్ఐఆర్ ఇన్‌చార్జి రాణా ప్రతాప్ సింగ్ రాథోడ్, పినపాక నియోజకవర్గ ఈఆర్‌వో కో-ఆర్డినేటర్ గాదే కేశవరెడ్డి శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా మండలంలోని పోలింగ్ కేంద్రాలు 210, 214, 215, 216, 220, 221, 225, 226లను సందర్శించి బీఎల్‌వోల పనితీరు, ప్రత్యేక ఓటరు జాబితా సవరణ ప్రక్రియ పురోగతిపై వివరాలు తెలుసుకున్నారు. పోలింగ్ కేంద్రం-221 బీఎల్‌వో సోడే నాగరత్నం 99 శాతం పనిని పూర్తి చేయగా, పోలింగ్ కేంద్రాలు 225లో బి. దేవకరణ, 226లో యు. వెంకమ్మలు 100 శాతం లక్ష్యాన్ని పూర్తి చేసినట్లు నాయకులు తెలిపారు. ఈ సందర్భంగా పూర్తి స్థాయిలో విధులు నిర్వహించిన బీఎల్‌వోలను బూర్గంపహాడ్ మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించి అభినందించారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు పూలపల్లి సుధాకర్ రెడ్డి, జిల్లా కార్యదర్శి వారాల వేణు, బీఎల్‌వోలు, బీఎల్ఏలు, ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# రేణుక చౌదరి ఎంపీ నిధులతో సిసి రోడ్‌కు శంకుస్థాపన చేసిన పీ.ఏ పుల్లయ్య,



**ఎర్రుపాలెం, జూలై 25 (జనంసాక్షి):**
ఖమ్మం జిల్లాఎర్రుపాలెం మండలం లో రేమిడిచర్ల గ్రామంలో కాంగ్రెస్ నాయకులు జవ్వాజి ఆనందరావు ఎంపీ రేణుక చౌదరి పిఏ పుల్లయ్య ఆధ్వర్యంలో గ్రామ కాంగ్రెస్ నాయకులు సామినేని చెన్నకేశవరావు గ్రామ సర్పంచ్ కాపు వరప్రసాదరావు అధ్యక్షతన శ్రీమతి రేణుక చౌదరి, ఎంపీ ఐదు లక్షల నిధులతో సీసీ రోడ్లుకు. శనివారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధి కోసం ఎంపీ రేణుక చౌదరి నిధులు మంజూరు చేసి గ్రామ అభివృద్ధికి తోడ్పడుతున్నారు.అన్నారు మాజీ కేంద్రమంత్రివర్యులుగా గతంలో జిల్లాలో అభివృద్ధి సంక్షేమ పథకాలు తెచ్చిన ఘనత ఎంపీ రేణుకా చౌదరి దే అన్నారు. అలాగే మధిర నియోజకవర్గంలో గ్రామాల అభివృద్ధికి నిధులు మంజూరు కు,కృషిచేసిన ఎంపీ,పిఏ,పుల్లయ్యకు కాంగ్రెస్ నాయకులు జువాజీ ఆనందరావు కు, కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు జవ్వాజి ఆనందరావు మార్కెట్ యార్డ్ చైర్మన్ దివ్య కృష్ణయ్య జిల్లా కాంగ్రెస్ నాయకులు బుగ్గవరపు వెంకటేశ్వరరావు, మాజీ మార్కెట్ యార్డ్, డిసిసి కార్యదర్శి,కర్లపూడి అప్పారావు ఆలస్యం నరసయ్య, మండల నాయకులు, జల్లేపల్లి. ప్రసాద్, గంగినేని.శ్యాంప్రసాద్, బాద.సత్యనారాయణ రెడ్డి, ఉప సర్పంచ్, నాగిరెడ్డి.సాంబశివరావు, చింత నిప్పుల.శ్రీనివాసరావు, కొండపాటి.భుజంగరావు, స్వామినేని.మురళి, సామినేని.నాగేశ్వరరావు, రవి, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రాణాలను బలిగొంటున్న మొండికుంట అశ్వాపురం రహదారి..

**వెంటనే నూతన రోడ్డు నిర్మించాలి..**

**ప్రమాదకరంగా మారిన ప్రధాన రహదారి..**

**భారీ వాహనాల రాకపోకలతో పూర్తిగా ధ్వంసం..**

**ఆర్ అండ్ బి శాఖ స్పందించాలని ప్రజల డిమాండ్..**



**అశ్వాపురం జులై 25 జనంసాక్షి:**
భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వాపురం మండలంలోని మొండికుంట?అశ్వాపురం ప్రధాన రహదారి అత్యంత ప్రమాదకరంగా మారింది. నిత్యం ఇసుక, బొగ్గు లారీలు సహా భారీ వాహనాలు అధిక సంఖ్యలో రాకపోకలు సాగించడం వల్ల రహదారి పూర్తిగా దెబ్బతింది. అనేక చోట్ల తారు పొర ఊడిపోవడం, రోడ్డు కుంగిపోవడం, గుంతలు ఏర్పడడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.ఈ రహదారిపై ప్రతిరోజూ స్కూల్ బస్సులు, కాలేజీ బస్సులు, ద్విచక్ర వాహనాలు, రైతులు, ఉద్యోగులు, అత్యవసర సేవల వాహనాలు ప్రయాణిస్తుంటాయి. రహదారి అధ్వాన్నంగా ఉండటంతో ఎదురెదురుగా వచ్చే వాహనాలు ఒకదానికొకటి తప్పించుకునే క్రమంలో ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.ప్రత్యేకించి ద్విచక్ర వాహనదారులు గుంతలను తప్పించబోయి అదుపుతప్పి కిందపడుతున్న సంఘటనలు తరచూ జరుగుతున్నాయని, ఇప్పటికే పలువురు గాయపడటంతో పాటు ప్రాణాలు కోల్పోయిన ఘటనలు కూడా జరిగాయని ప్రజలు చెబుతున్నారు. ఈ పరిస్థితుల్లో చిన్నారులతో ప్రయాణించే కుటుంబాలు, వృద్ధులు, మహిళలు భయాందోళనల మధ్య ప్రయాణం సాగిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.
ప్రజలు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినప్పటికీ ఆర్ అండ్ బి శాఖ అధికారులు స్పందించడం లేదని వాహనదారులు విమర్శిస్తున్నారు. రహదారి పరిస్థితిని పరిశీలించి శాశ్వత పరిష్కారం చూపాల్సిన అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపిస్తున్నారు.మొండికుంట నుంచి అశ్వాపురం వరకు ఉన్న ఈ రహదారిని 'బ్లాక్ స్పాట్ గా గుర్తించి తక్షణమే నూతన రహదారి నిర్మాణం చేపట్టాలని స్థానిక ప్రజలు, రైతులు, వాహనదారులు, ప్రజాప్రతినిధులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు. మరిన్ని ప్రమాదాలు జరిగి అమాయకుల ప్రాణాలు బలికాకముందే ప్రభుత్వం స్పందించి నిధులు మంజూరు చేసి నాణ్యమైన రహదారిని నిర్మించాలని వారు డిమాండ్ చేస్తున్నారు. మొండికుంట? అశ్వాపురం రహదారిని వెంటనే పునర్నిర్మించాలి.గుంతలను అత్యవసరంగా పూడ్చి తాత్కాలిక మరమ్మతులు చేపట్టాలి.భారీ వాహనాల రాకపోకలపై నియంత్రణ చర్యలు తీసుకోవాలి.ప్రమాదాల నివారణకు హెచ్చరిక బోర్డులు, రిఫ్లెక్టర్లు ఏర్పాటు చేయాలి.ప్రజల ప్రాణాలను కాపాడేలా ఆర్ అండ్ బి శాఖ తక్షణ చర్యలు చేపట్టాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.